RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| | | | | | |
|---|---|---|---|---|---|
| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 42 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, జులై 30, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 42 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, July, 30, 2025 | PAGES : 8 RS : 4 /- |




## ఉగ్రవాదుల ఏరివేతలో 'సిందూర్, మహాదేవ్'లది కీలక పాత్ర

### - ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, : ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి హెూంమంత్రి అమిత్ షా లోక్‌సభలో చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ స్పందించారు. ఉగ్రవాదులను ఏరివేయడంలో ఆపరేషన్ మహాదేవ్, ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్లు కీలక పాత్ర పోషించాయని స్పష్టం చేశారు. వీటి గురించి హెూంమంత్రి సుదీర్ఘ వివరణ ఇచ్చారని అన్నారు. దేశ భద్రతపై భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన తన ప్రసంగంలో సవివరంగా చెప్పారంటూ ట్వీట్ చేశారు. అంతకుముందు ఇదే అంశంపై లోక్‌సభలో అమిత్ షా ప్రసంగిస్తూ ప్రతిపక్షాల తీరుపై ధ్వజమెత్తారు. అసలు దేశం అభివృద్ధి చెందకపోవడానికి, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ఉనికికి నెహ్రూనే కారణమని ఆరోపించారు. 1948లో భారత సైనిక దళాలు పీవోకేను చేజిక్కించుకునే స్థానంలో ఉన్నప్పటికీ అప్పటి ప్రధాని ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించడం వల్ల ఆ అవకాశం చేజారిపోయిందన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ కూడా నెహ్రూ చర్యలను వ్యతిరేకించారని గుర్తు చేశారు.



## ఆపరేషన్ సిందూర్‌పై సందేహాలా

- ఉగ్రమూకలను అణచివేస్తే సంతోషించరా
- మాజీ హోంమంత్రికి ఉగ్రవాదుల ఉనికిపై అనుమానాలా
- లోక్‌సభలో సిందూర్ అమిత్ షా ప్రసంగం
- చిందబరం వ్యాఖ్యలపై గట్టిగా కౌంటర్
- ముగ్గురు పహల్గా ఉగ్రవాదులను మట్టుబెట్టామని వెల్లడి

న్యూఢిల్లీ, : పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారణంగా ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత్ చేపట్టిన ఆపరేషన్‌పై విపక్షాలు సంతోషం వ్యక్తం చేస్తాయనుకుంటే.. సందేహాలు వ్యక్తం చేస్తున్నాయంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. లోక్‌సభలో రెండో రోజు మంగళవారం జరిగిన ప్రత్యేక చర్చలో అమిషా మాట్లాడారు. విపక్ష ఎంపీల వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. ఉగ్రవాదులను మట్టు-బెడితే ఆనందం వ్యక్తం చేస్తారనుకున్నానని.. కానీ విపక్ష సభ్యులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.



## ట్రక్కును ఢీకొట్టిన బస్సు

### - 18మంది యాత్రికులు మృతి

జార్ఖండ్ : జార్ఖండ్‌లోని డియోఘర్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కన్వర్ యాత్ర సందర్భంగా ఈరోజు తెల్లవారుజామున 4 గంటల 30 నిముషాలకు మోహన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జమునియా అడవి సమీపంలో యాత్రికులతో వెళుతున్న బస్సు గ్యాస్ సిలిండర్లతో వెళుతున్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 18మంది యాత్రికులు మరణించారు.



## న్యూయార్క్‌లో కాల్పులు..

### పోలీసు అధికారి సహా ఐదుగురు మృతి

న్యూయార్క్: అమెరికాలో మరోసారి తుపాకీ మోత మోగింది. దేశ వాణిజ్య రాజధాని న్యూయార్క్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. మాన్‌హట్టన్‌లోని ఓ బిల్డింగ్‌లోకి చొరబడిన దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో ఎన్‌వైపీడీకి చెందిన పోలీస్ సహా నలుగురు మృతి చెందారు. మరికొందరికి గాయాలయ్యాయి. పోలీసుల కాల్పుల్లో దుండగుడు హతమయ్యాడు. నిందితుడిని లాస్ వెగాస్‌కు చెందిన 27 ఏండ్ల షేన్ డెవోన్ తమురాగా గుర్తించారు.



## భూ వివాదం కేసులో.. రేవంత్ రెడ్డికి ఊరట

- పెద్దిరాజు తదితరులు వేసిన పిటిషన్ తిరస్కరణ
- ఫిర్యాదుదారుకు కోర్టు ధిక్కరణ కింద నోటీసులు

న్యూఢిల్లీ, : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. భూవివాదం కేసులో ఎన్ పెద్దిరాజు వేసిన కేసులో.. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు క్వాష్ చేసింది.అయితే హైకోర్టు ఆదేశాలపై ఎన్ పెద్దిరాజు సుప్రీంకోర్టులో సవాలు వేశారు. ఈ కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్‌లో హైకోర్టు తీర్పునకు సంబంధింన అంశాలతో పాటూ జడ్జి పైన అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్లు- సమాచారం. ఎన్ పెద్దిరాజు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. అలాగే ఎన్ పెద్దిరాజుతో పాటు-, ఆయన అడ్వకేట్ రితేష్ పాటిల్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ బీఆర్ గవాయి తదుపరి విచారణకు పిటిషనర్ అండ్ పెద్దిరాజు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించారు. భూ వివాదం వ్యవహారంలో సొసైటీ- స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, లక్ష్మయ్య పై పెద్దిరాజు ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పీఎస్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



## కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందన్న వార్తలను ఖండించిన కేంద్రం

న్యూఢిల్లీ, : కేరళ నర్సు నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దయ్యిందంటూ వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. అవన్నీ అవాస్తవమని పేర్కొన్నాయి. నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు కాలేదని మంగళవారం వెల్లడించాయి. నిమిష ఉరిశిక్షను రద్దు చేస్తూ యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందంటూ భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ మత ప్రబోధకుడు కాంతపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం సోమవారం రాత్రి ప్రకటించింది. అక్కడ జరిగిన ఉన్నత స్థాయి భేటీలో ఉరిశిక్షణ రద్దు నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. దీనిపై భారత విదేశాంగ శాఖ వర్గాలు తాజాగా స్పందించాయి. నిమిష మరణశిక్ష రద్దు చేశారంటూ కొంత మంది వ్యక్తులు నుంచి వచ్చిన సమాచారం అవాస్తవమని వెల్లడించాయి.

## రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తాం : ఉత్తమ్

- మంత్రి అడ్లూరితో కలసి సాగర్ గేట్లు ఎత్తిన మంత్రి ఉత్తమ్



నాగార్జునసాగర్,తెలంగాణ దిశ: రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను ఆధునికరిస్తామని,అలాగే పూడిక తీస్తామని ,రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకు మార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ సం క్షేమ శాఖల మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఈ సందర్భం గా మీడియా ప్రతినిధులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక ఆధునిక దేవాలయం అని అన్నారు.



## సింగరేణిలో పడిపోతున్న.. బొగ్గు ఉత్పత్తి

ఖమ్మం,తెలంగాణ దిశ : తెలంగాణలో భారీ వర్షాల కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయింది. ఫలితంగా విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఆటంకం ఏర్పడింది. నిల్వలు పడిపోయాయి. తెలంగాణవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. దీని కారణంగా అనేక చోట్ల జనజీవనం స్తంభించింది. కాగా భారీ వర్షాల ప్రభావం సింగరేణికార్యకలాపాలపైనా పడింది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి భారీ స్థాయిలో పడిపోయింది. వాస్తవానికి రోజుకు 2.20లక్షల బొగ్గు డిమాండ్ ఉండగా..

## బిసి రిజర్వేషన్ల కోసం 72 గంటల నిరాహార దీక్ష



### జాగృతి అధ్యక్షురాలు కవిత హెచ్చరిక..!

హైదరాబాద్ ,తెలంగాణ దిశ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆగస్టు 4, 5, 6 తేదీల్లో తాను 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయబోతున్నానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి కోరి దీక్షకు దిగుతానని ఒక వేళ అనుమతి ఇవ్వకపోతే ఎక్కడ కూర్చుంటే అక్కడే నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.



## నిండుకుండలా నాగార్జున సాగర్

### 18 ఏళ్ల తరవాత జూలైలో ఈ మోతాదులో నీటి చేరిక

నాగార్జునసాగర్,తెలంగాణ దిశ : ఎగువ నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు- ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థం 590.00అడుగులకుగాను ప్రస్తుతం 586.60 అడుగులకు చేరింది. ప్రాజెక్టు గేట్లు- ఎత్తిన నేపథ్యంలో.. దిగువ భాగంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్ల తర్వాత.. నెల ముందుగానే నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేయడం ఇదే తొలిసారి. వరద ప్రవాహం పెరగడంతో మంగళవారం నాగార్జున సాగర్ గేట్లను ఎత్తారు. మంత్రులచేతుల మీదుగా ఉదయం 11 గంటలకు గేట్లను తెరిచారు. మొత్తం 14 గేట్లను 5 అడుగుల మేర ఓపెన్ చేశారు. అయితే సాగర్ గేట్లను ఎత్తడానికి ముందు బేగంపేట ఎయిర్‌పోర్టులో మంత్రుల గొడవపడ్డారు. షెడ్యూల్ ప్రకారం నల్లగొండ జిల్లా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం ఉదయం 10 గంటలకు నాగార్జున సాగర్ గేట్లను తెరువాల్సి ఉంది.

# నాగదేవత అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి





**కుత్బుల్లాపూర్, జూలై 29, (తెలంగాణ దిశ):** రంగారెడ్డి నగర్ డివిజన్ గిరినగర్ నాగ దేవత ఆలయంలో మంగళవారం నాగ దేవత కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత శుభదినమైన నాగుల పంచమి పర్వదినాన నిర్వహిస్తున్న ఈ కళ్యాణ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. నాగదేవత అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు శంకరయ్య, ఖాదర్, ఓంకార్ రెడ్డి, జల్లా లక్ష్మీనాథ్, క్రాంతి యాదవ్, బంటి (సాయి కిరణ్), రమ్మీ, అల్లావుద్దీన్, మహిళా అధ్యక్షురాలు తారక రాణి, భారతి, ఈశ్వరి, ఆలయ కమిటీ సభ్యులు అమరేందర్ చారి, ఉదయ్ గంజి, సురేష్.ఎ, వరలక్ష్మి, శ్రీకాంత్, వినోద్, జయంత్, శ్రీకాంత్.కె, నాగరాజు, బస్తీ వాసులు కొండ శ్రీకాంత్, యశ్వంత్, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

### నేడు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి టీంతో

# టి-సాట్ ప్రత్యేక చర్చా కార్యక్రమం

**శేరిలింగంపల్లి, జూలై 07, (తెలంగాణ దిశ) :** 'తెలంగాణ వ్యవసాయం– రైతు సమస్యలు' అనే అంశంపై బుధవారం టి–సాట్ నెట్ వర్క్ ఛానళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు హాజరవుతారని టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూబ్లీహిల్స్ లోని టి–సాట్ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు టి–సాట్ నిపుణ ఛానల్ లో ప్రసారమయ్యే లైవ్ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు సభ్యులు పాల్గొని తెలంగాణలో



రైతు సంక్షేమం– కమిషన్ పర్యవేక్షణపై వివరిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో పాటు రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలపై చర్చిస్తారని వివరించారు. అదే విధంగా రైతుల ప్రశ్నలకు సమాధానాలిస్తారన్నారు. తెలంగాణలోని రైతులు, రైతు వ్యవసాయ కూలీలు తమ తమ సందేహాలకు సమాధానాల కోసం 040–2354 0326/726 టోల్ ఫ్రీ నెం.1800 425 4039 లకు ఫోన్ చేయాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు. ప్రత్యేక చర్చా కార్యక్రమం టి–సాట్ శాటి లైట్ ఛానళ్లతో పాటు యూట్యూబ్, యాప్ లోనూ ప్రసారమవుతుందని తెలిపారు.

# ప్రభుత్వ హాస్టళ్లలో కోడిగుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు కమిటీ



### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**రాజన్న సిరిసిల్ల,తెలంగాణ దిశ :** ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాల్లో ఏడాదిపాటు కోడి గుడ్ల సరఫరా టెండర్ల పర్యవేక్షణకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. కోడిగుడ్ల సరఫరా టెండర్ల పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ చైర్మెన్ గా, జిల్లా విద్యాధికారి, ఆయా రెసిడెన్షియల్ విద్యాలయాలు బాధ్యులు, పశు సంవర్ధక శాఖ అధికారులు సభ్యులుగా ఈ కమిటీ లో ఉంటారని వెల్లడించారు. ప్రభుత్వ వసతి గృహాల నుంచి కోడిగుడ్డుల ఇండెంట్ వివరాలు జిల్లా కలెక్టరేట్ కు సమర్పించాలని జిల్లా అడ్మినిస్ట్రేషన్ నుండి నేరుగా సప్లయర్ కు అవసరమైన కోడిగుడ్ల ఇండెంట్ ను సమర్పించడం జరుగుతుందని, గత సంవత్సరం అడ్మిషన్లకు అదనముగా 10% విద్యార్థుల సంఖ్యను పెంచి ఇండెంట్ తయారు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కోడిగుడ్డు బరువు 45 గ్రాముల నుంచి 52 గ్రాములు ఉండాలని, ప్రతి మాసం రెండు సార్లు సప్లై చేయాలని సూచించారు. అర్హత,అనుభవం వారికి నిబంధనల ప్రకారం కోడిగుడ్ల సరఫరా చేసేహక్కులుఅందజేస్తామని, కోడిగుడ్ల సరఫరాలోఆలస్యం చేస్తే పెనాల్టీలు విధిస్తామని కలెక్టర్ తెలిపారు. టెండర్ల విధానం, టెండర్లు ఆహ్వానం,తెరవడం తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్ రావు, ఆయా విద్యాలయాల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# అల్పాహారం పెట్టడం లేదని రోడ్డెక్కిన విద్యార్థులు

**-విద్యార్థుల కడుపు కొడుతున్న ఎస్సీ ఎస్ఎంహెచ్ వార్డెన్ ను వెంటనే సస్పెండ్ చేయాలి**

**-ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ నాయకులు**



**మంథని,తెలంగాణ దిశ :** పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ కేంద్రంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గృహం లోని విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పెట్టడం లేదని పేర్కొంటూ ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ నాయకులు హాస్టల్ విద్యార్థులను కలుపుకొని రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఉదయం మంథని అంబేద్కర్ కూడలిలో ఎస్ఎఫ్ఐ ,డివైఎఫ్ఐ నాయకులు హాస్టల్ విద్యార్థులతోరాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్ లు మాట్లాడుతూ హాస్టల్లో ఉన్నటువంటి విద్యార్థులకు సమయానికి రోజు వారి మెనూ పెట్టకుండా వారికి ఇవ్వాల్సిన వంట సరుకులు ఇవ్వకుండా హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు. గత నాలుగు రోజులనుండి హాస్టల్ వార్డెన్ విధులకు రాకుండా కనీసం లీవ్ లెటర్ అధికారులకు ఇవ్వకుండా ఇంట్లో ఉంటున్నారని జీతం మాత్రం సమయానికి తీసుకుంటున్నారని ఆరోపించారు.స్థానికంగా ఉండవలసిన వార్డెన్ ఇంట్లో ఉంటూ విద్యార్థుల కడుపు కొడుతున్నారని అన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకుండా విద్యార్థులు హాస్టల్ లో కొట్టుమిట్టాడుతున్నారని,సరైన రూములు, ఫ్యాన్ల సౌకర్యం లేక దోమల వల్ల విద్యార్థులు నిద్రపోని పరిస్థితి ఉందన్నారు. హాస్టల్ ను పర్యవేక్షించాల్సిన ఏఎస్ డబ్ల్యూ వో కనీసం హాస్టల్ పరిస్థితిని సందర్శించిన దాఖలాలు లేవని ఈ విషయంపై వివరణ కోరగా కనీసం స్పందించనిపరిస్థితి ఉందన్నారు.
డీడీ కూడా ఫోన్ చేస్తేస్పందించడం లేదని జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నదని వాపోయారు. వెంటనే హాస్టల్ లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్ ను, ఉన్నతాధికారులైన ఏఎస్ డబ్ల్యూ వో మరియు డి డి ని కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి తేజ, కళ్యాణ్, రాజేష్, శ్రీకాంత్ లతో పాటు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షుడు గా హరి ప్రసాద్ ఎన్నిక

**కరీంనగర్,తెలంగాణ దిశ :** భగత్ నగర్ ఆర్య వైశ్య అభ్యుదయ సంఘం అధ్యక్షునిగా కొల్లూరు హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులచే ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అనంతరం జిల్లా నాయకులు నియామక పత్రం అందజేశారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ సంఘం అంటే అందరూ కలిసి ఉండి మానవసేవే మాధవసేవ అని సభాముఖంగా తెలియజేసారు. సంఘ అభివృద్ధికి సమాజ శ్రేయస్సుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రతిమ హాస్పిటల్ ఉచిత బస్ సేవలు ప్రారంభం




**మంథని,తెలంగాణ దిశ :** మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, మల్హార్ రావు,కమాన్ పూర్, రామగిరి మండలాల ప్రజల సౌకర్యార్థం కరీంనగర్ ప్రతిమ హాస్పిటల్ వారుమంథని నుండి ఉచిత బస్ సౌకర్య సేవలను ప్రారంభించారు. సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 8 గంటల కు మంథని నుండి బయలుదేరుతుందని పలు మండలాల ప్రజలు వైద్య సేవల నిమిత్తం ఉచిత బస్ సౌకర్య సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సదానందం 9705309496, ఫౌండేషన్ రాజశేఖర్ 8099816107 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

# మల్లాపూర్ లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 74 లక్షల మంజూరు

## - సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్, జూలై 29, (తెలంగాణ దిశ) : మల్లాపూర్ డివిజన్ పరిధిలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ 74 లక్షలు మంజూరు చేయడం పట్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్‌పార్టీ డివిజన్ అధ్యక్షుడు కప్పర సాయి కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు నెమిలి అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి ఆనందోత్సవాలను జరుపుకున్నారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆయా బస్తీలలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతూరి రాజు గౌడ్, పిజి. సుదర్శన్, బెల్లం గట్టియ్య, నెమలి అనిల్, కోయగూర బాలరాజ్, మక్తల బాలరాజ్, జమీలా బేగం, సురేష్, మనోహర్, ఎస్ వి. కిట్టు, జానీ, జోష్, శ్రీనివాస్, రాజేష్, పర్వతాలు, మల్లు, సతీష్, ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# పిహెచ్ సీ సెంటర్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలి - జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి



**కీసర, జూలై 29,(తెలంగాణ దిశ) :** 24 గంటలు వైద్య సేవలు అందించే పిహెచ్ సీ సెంటర్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. మంగళవారం కీసర మండలంలోని పిహెచ్ సీ సెంటర్ ను డిఎం అండ్ హెచ్ ఓడాక్టర్ ఉమాగౌరీ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు ఎన్ని ఓపి కేసులు ఉంటాయని, ఎన్ని ప్రసవాలు జరుగుతాయని మెడికల్ ఆఫీసర్ ను అ డిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ రోజుకు ఎంత మందికి వేస్తారని అడిగారు. ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారా అని, ఈ ఆసుపత్రి కింద ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ను మెడిసన్ రూమ్ తోపాటు ఆసుపత్రి పరిసరాలను పరిశీలిం చారు.వర్షం నీరు కురిసి గోడలు నిమ్మ రావడం పరిశీలించిన ఆయన అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ విభాగం వారిని ఆదేశి ంచారు.ఆస్పత్రికి అవసరమైన మరమ్మత్తులు సంబం ధించిన ప్రతిపా దనలు తనకు పంపాలని మెడికల్ ఆఫీసర్‌కుకలెక్టర్ సూచించా రు. అనంతరం జవహర్ నవోదయ విద్యాలయ నిర్మాణ స్థలాన్ని ఆర్ డిఓ ఉపేందర్ రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ పర్యటనలో కీసర ఎమ్మార్వో అశోక్ మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







నాగ పంచమి సందర్భంగా శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రాంగణంలోని నాగదేవత పుట్టకు ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని శ్రీ వల్లి దేవసేన సమేత కొక్కి నాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఉదయం పంచామృత నవకాలశాభిషేకం, కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభ్యర్థన మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్ కు లేఖ రాశారు. చర్లపల్లి డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తూ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ జారీ చేసిన ఉత్తర్వులను బుధవారం ఎమ్మెల్యే ల క్ష్మారెడ్డికి అందజేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు నేమూరీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

- (చర్లపల్లి, తెలంగాణ దిశ)

# సంపాదకీయం

## ఇక డాలర్ టైమ్ అయిపోయిందా

బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరించారు. ఈ కూటమి కూడా త్వొందర్లోనే అంతమవుతుందని ట్రంప్ అన్నారు.బ్రిక్స్ దేశాలు అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాయని, అందుకే తాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ శుక్రవారం వైట్‌హౌస్‌లో తెలిపారు.అయితే, ఈ సందర్భంగా ట్రంప్ ఏ దేశం పేరును ప్రత్యేకంగా ప్రస్తావించలేదు.బ్రిక్స్ కూటమిలో కీలక దేశాలైన భారత్, రష్యా, చైనా తమ మధ్య త్రైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు.అంతకుముందు కూడా బ్రిక్స్ దేశాలపై సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు చేశారు.భారత్, చైనా మధ్య సంబంధాలను తిరిగి గాడిలో పెట్టేందుకు రష్యా ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం చైనా దీనికి సానుకూలంగా స్పందిస్తోంది.చైనా, రష్యా, భారత్ మధ్య త్రైపాక్షిక సంబంధాలు కేవలం మూడు దేశాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా.. ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతిని, భద్రతను, స్థిరత్వాన్ని, అభివృద్ధిని అందించేందుకు సాయం చేస్తుందని చైనా విదేశీ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు.త్రైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి రష్యా, భారత్‌లతో చర్చలు జరిపేందుకు చైనా సిద్ధంగా ఉందని లిన్ అన్నారు.రష్యా–భారత్–చైనా (ఆర్ఐసీ) ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించేందుకు భారత్, చైనాతో రష్యా చర్చలు జరుపుతోందని అంతకుముందు ఆ దేశ డిప్యూటీ ఫారిన్ మినిస్టర్ ఆంద్రీ రుడెంకో చెప్పారు.బ్రిక్స్ విషయం ప్రస్తావించిన ట్రంప్.. " బ్రిక్స్ అని పిలిచే ఒక చిన్న గ్రూప్ త్వరలోనే అంతం కాబోతుంది. డాలర్‌ను, డాలర్ ఆధిపత్యాన్ని, ప్రమాణాలను ఇది చేజిక్కించుకునేందుకు చూసింది" అన్నారు."బ్రిక్స్ గ్రూప్‌లోని అన్ని దేశాలపై మేం 10 శాతం సుంకాలను విధించనున్నామని చెప్పాను. ఆ తర్వాత రోజే వారు సమావేశం నిర్వహించారు. కానీ, ఎవరూ హాజరుకాలేదు" అని ట్రంప్ వెటకారంగా అన్నారు.ఆ తర్వాత ట్రంప్ మరోసారి డాలర్‌ను బలోపేతం చేయాలని, ప్రపంచ కరెన్సీగా దాన్ని ఉంచాలని నొక్కి చెప్పారు."మేం డాలర్‌ను పడిపోనీయం. ప్రపంచ కరెన్సీగా డాలర్ తన హోదాను కోల్పోతే, అది ప్రపంచ యుద్ధంలో ఓడిపోయిన మాదిరే అవుతుంది" అని తెలిపారు.'బ్రిక్స్ దేశాల కూటమి గురించి విన్నప్పుడు, నేను వారిపై కఠిన వైఖరిని అనుసరించాను. ఒకవేళ ఈ దేశాలు ఏకమైతే, త్వరలోనే ఈ గ్రూప్ అంతమవుతుంది" అని అన్నారు.ఈ ఏడాది జులై 6, 7 తేదీల్లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో బ్రిక్స్ 17వ సదస్సు జరిగింది. ఈ సదస్సు తర్వాత కూడా అదనంగా 10 శాతం సుంకాలను విధిస్తానని ట్రంప్ హెచ్చరించారు.'బ్రిక్స్‌కు చెందిన ఏ దేశమైనా అమెరికా వ్యతిరేక విధానాలతో ఉంటే అదనంగా 10 శాతం సుంకాలను ఎదుర్కోవాలి. ఈ సుంకాల విధింపులో ఎలాంటి మినహాయింపు ఇవ్వం" అని జులై 7న ఒక సోషల్ మీడియా పోస్టులో ట్రంప్ రాశారు.'ప్రపంచ పాలనను మెరుగుపర్చడం', 'అంతర్జాతీయ సుస్థిరత'పై బ్రిక్స్ రియో డిక్లరేషన్‌లో చర్చించారు. దీంతో పాటు ఏకపక్ష సుంకాలు, సుంకాలు లేకపోవడంపైనా చర్చ జరిగింది.ఈ డిక్లరేషన్ మేనిఫెస్టోలో అమెరికా పేరును ప్రస్తావించలేదు.వాణిజ్య విధానాలను వక్రీకరించి, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నిబంధనలను ఉల్లంఘించే ఏకపక్ష సుంకాలు, నాన్–టారిఫ్ చర్యల వినియోగంపై బ్రిక్స్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయని రియో డిక్లరేషన్ పేర్కొంది.ఏకపక్ష బలవంతపు చర్యలు విధించడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడం కిందకే వస్తుందని ఈ డిక్లరేషన్‌లో బ్రిక్స్ దేశాలు పేర్కొన్నాయి.ఏకపక్ష ఆర్థిక ఆంక్షలు వంటివి ప్రపంచంపై ప్రతికూల ప్రభావాలను చూపిస్తాయని తెలిపాయి.ఈ బ్రిక్స్ సదస్సులో డబ్ల్యూటీఓ నిబంధనలకు అనుగుణంగా వాణిజ్యాన్ని సమర్థిస్తూ, బహుళ పక్ష వాణిజ్య విధానం గురించి చర్చించినట్లు తెలిపింది.2020లో భారత్, చైనా దేశాలకు చెందిన సైనికుల మధ్య ఘర్షణ నెలకొనడంతో, ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ తర్వాత ఆర్ఐసీ కోసం ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు.ఆర్ఐసీ ఫార్మాట్‌ను తిరిగి ప్రారంభించడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోందని జులై 17న భారత మీడియాలో కథనాలు వచ్చాయి. మూడు దేశాలకు అనువైన విధానంలోనే ఏదైనా నిర్ణయం తీసుకుంటారని ఆ కథనాలు పేర్కొన్నాయి.షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ)లో పాల్గొనేందుకు ఐదేళ్లలో తొలిసారి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చైనాకు వెళ్లిన సందర్భంగా.. ఆర్ఐసీ ఫార్మాట్‌పై చర్చలు జరిగాయి.ఏకపక్షం, రక్షణవాదం, అధికార రాజకీయం, బెదిరింపులు ప్రపంచానికి తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి" అని జులై 14న జైశంకర్‌తో భేటీ అయిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ లీ చెప్పారు.అందుకే, రెండు దేశాలు సామరస్యంగా జీవించేందుకు, ఒకదానికొకటి సాయపడుతూ విజయం సాధించే మార్గాలను అన్వేషించాలని అన్నారు.రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అతిపెద్ద దేశాలు భారత్, చైనాలు.ఈ రెండు దేశాలు అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధించే అదనపు సుంకాల ముప్పు ముంగిట ఉన్నాయి. సుంకాలు విధిస్తామని 50 రోజుల్లో యుక్రెయిన్‌తో యుద్ధం ముగించేలా ఒప్పందానికి రావడానికి రష్యాపై ఒత్తిడి తీసుకు రానుంది అమెరికా.ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణించాయని చైనా నిపుణులు అంటున్నారు.చైనీస్ న్యూస్ అవుట్‌లెట్ గ్వాంచాలో జులై 13న రాసిన కథనంలో.. అమెరికా, భారత్ మధ్య కొనసాగుతోన్న వాణిజ్య సంక్షోభాన్ని ఫుడాన్ యూనివర్సిటీకి చెందిన ఝి చావో ప్రస్తావించారు.భారత్‌ను కట్టడి చేసేందుకు పాకిస్తాన్‌ను వాడుకోవడం, రెండు దేశాల మధ్య బలవంతంగా సయోధ్యను కుదర్చడం వంటి వ్యూహాన్ని అమెరికా అవలంభించిందని ఆయన అన్నారు.చైనాకు చెందిన ఇంటర్నేషనల్ స్కాలర్ ప్రొఫెసర్ జిన్ కాన్‌రాంగ్ కూడా ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణిస్తుండటంతో.. అమెరికా, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ఇటీవల మరింత మెరుగుపడ్డాయని తెలిపారు.జూన్‌లో కెనడాలో జరిగిన జీ–7 సదస్సుకు హాజరయ్యేందుకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను కలవలేకపోయారని ప్రొఫెసర్ జిన్ అన్నారు.ఆ తర్వాత పాకిస్తానీ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు ట్రంప్ వైట్‌హౌస్‌లో ఆతిథ్యం ఇచ్చిన తర్వాత భారత్ మరింత అసంతృప్తి వ్యక్తం చేసింది.చైనా, రష్యాతో అమెరికా సంబంధాలు ఉద్రిక్తతంగా మారాయి. యుక్రెయిన్‌పై రష్యా దాడి చేసిన తర్వాత చైనా, రష్యాలు మరింత దగ్గరయ్యాయి.అమెరికా ఆధిపత్యంలోని ప్రపంచాన్ని తిరస్కరించి, బహుళ ధ్రువ ప్రపంచాన్ని అంటే పలు దేశాల మధ్య అధికారాన్ని పంపిణీ చేసే వ్యవస్థను సృష్టించాలని ఈ రెండు దేశాలు చర్చిస్తున్నాయి.అందుకే ప్రపంచంలో అమెరికా కరెన్సీ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేసేందుకు రెండు దేశాలు చాలా కాలంగా ప్రయత్నిస్తున్నాయి.అమెరికా డాలర్‌తో కాకుండా చైనా కరెన్సీ యువాన్‌తో ఆసియా, ఆఫ్రికా, దక్షిణా అమెరికా దేశాలతో వాణిజ్యం చేయాలనుకుంటున్నట్లు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ 2023లో చెప్పారు.చైనా ఇప్పటికే రష్యాతో తన కరెన్సీ యువాన్‌తో ట్రేడ్ చేస్తోంది. రష్యా కూడా అదే చేస్తోంది. ఎందుకంటే, అమెరికా, పశ్చిమ దేశాలు రష్యాపై తీవ్ర ఆర్థిక ఆంక్షలు విధించాయి.అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, వీటి మిత్ర దేశాలు చాలా అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ చెల్లింపు వ్యవస్థ స్విఫ్ట్ నుంచి రష్యన్ బ్యాంకులను నిషేధించాయి."బ్రిక్స్ దేశాలు ప్రత్యామ్నాయ కరెన్సీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఒకవేళ ప్రత్యామ్నాయ కరెన్సీని సృష్టించలేకపోతే, కనీసం ఫైనాన్సియల్ నెట్‌వర్క్‌నైనా సృష్టించాలని అనుకుంటున్నాయి" అని విదేశీ వ్యవహారాల నిపుణులు, 'ది ఇమేజ్ ఇండియా ఇనిస్టిట్యూట్' అధ్యక్షుడు రబీంద్ర సచ్‌దేవ్ చెప్పారు."స్విఫ్ట్ బ్యాంకింగ్ ఇంటర్నేషనల్ అమెరికా, యూరప్, పశ్చిమ దేశాలఆధిపత్యంలో ఉంది.ఏదైనా దేశంపై ఆంక్షలు విధిస్తే, ఈ వ్యవస్థ నుంచి అది వైదొలుగుతుంది" అని రబీంద్ర చెప్పారు.' రష్యాపై విధించిన ఆంక్షలను చూస్తే, భవిష్యత్‌లో తమ బ్యాంకింగ్‌ను కూడా బ్లాక్ చేస్తాయేమోనని బ్రిక్స్ దేశాలు భయపడుతున్నాయి.

# ఏడాది కూటమి పాలన-రాష్ట్ర ఆర్థిక పరిస్థితి



తెలుగుదేశం–జనసేన–బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. గత వైసిపి ప్రభుత్వ ఆర్థిక అరాచక పరిస్థితి నుండి రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నట్లు చంద్రబాబు ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నది. రెండోవైపు తరచూ పన్నుల వసూళ్ల శాఖలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ పన్ను రాబడి పెంచాలని టార్గెట్లు ఇస్తూ ప్రజల మీదకి వదులుతున్నారు. అయినా ఈ త్రైమాసికంలో మొత్తం రూ. 69,984 కోట్ల వ్యయానికిగాను వచ్చిన మొత్తం ఆదాయం రూ. 36,239 కోట్లు మాత్రమే. వచ్చిన ఆదాయం చేసిన ఖర్చుకు సరిపోక పోవడంతో రూ. 37,097 కోట్లు అప్పులు తీసుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025 – 26)లో మొత్తం రూ. 79926 కోట్లు అప్పులు తీసుకోవాలని బడ్జెట్‌లో అంచనా వేశారు. మొదటి ఏప్రిల్ – జూన్ మూడు నెలలకే 46 శాతం అప్పు తీసుకొచ్చారు. మిగిలిన తొమ్మిది నెలల్లో ఎంత అప్పు తీసుకు రావాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో తెలుస్తున్నది.

2024–25 బడ్జెట్‌లో రూ. 2.94 లక్షల కోట్లు ఆదాయాన్ని ప్రతిపాదించారు. ఇందులో అప్పులు మినహా రూ. 2.01 లక్షల కోట్లు ఆదాయం వస్తుందనిఅంచనా వేశారు. కానీ రూ. 1.68 లక్షల కోట్లు (83 శాతం) మాత్రమే వచ్చింది. 2023 – 24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే సుమారు రూ. 16 వేల కోట్లు ఆదాయం తగ్గింది.

రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర సొంత పన్నుల ద్వారా వచ్చే ఆదాయం అత్యంత ముఖ్యమైనది. ఇందులో రాష్ట్ర జీఎస్టీ, అమ్మకపు పన్ను, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలు, ఎక్సైజ్ డ్యూటీ, రవాణా పన్నుతో పాటు పన్నేతర ఆదాయాలు ఉంటాయి. గత ఏడాది మొత్తంగా రాష్ట్రానికి తన పరిధిలో రూ. 1,11,439 కోట్లు సొంత ఆదాయం వచ్చింది. కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.36,869 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల గ్రాంట్లు రూ. 20135 కోట్లు రాష్ట్రానికి చేకూరింది. ఇవి చాలక బడ్జెట్ అంచనాల్లో పేర్కొన్న రూ. 68372 కోట్లు మించి రూ. 81,597 కోట్లు అప్పులు తీసుకోవాల్సి వచ్చింది. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తీసుకు రావటంలో గత వైసిపి ప్రభుత్వం, నేటి తెలుగు దేశం కూటమి ప్రభుత్వం మధ్య ఎలాంటి తేడా లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కూటమి పార్టీలు నేడు అప్పుల కోసం వెంపర్లాడటమే కాక అప్పుల కోసం రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కూడా ఫణంగా పెట్టటానికి వెనుకాడటం లేదు.

వృద్ధి రేటును, రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదలను రాష్ట్ర అభివృద్ధికి చిహ్నాలుగా పదేపదే ప్రచారం చేస్తున్నది. ప్రస్తుత 2025 %–% 26 సంవత్సరం 14 శాతం వృద్ధి రేటుతో మొత్తం రూ.18.3 లక్షల కోట్లకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి చేరుకుంటుందని అంచనా వేశారు. వాస్తవంగా రాష్ట్ర వృద్ధి రేటు పెరుగుదలకు లేదా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుదల లేదా ఉత్పత్తి పరిమాణానికి అనుగుణంగా రాష్ట్ర పన్నుల ఆదాయంలో పెరుగుదల లేదు. దీనికి ఒక ముఖ్యమైన కారణం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున కార్పొరేట్ శక్తులకు పన్నులు, ఇతర అనేక రూపాల్లో రాయితీలివ్వడం వల్ల స్థూల ఉత్పత్తి పెరిగినా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం దానికి అనుగుణంగా పెరగడం లేదు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా జీఎస్టీ, అమ్మకపు పన్ను, విద్యుత్ చార్జీలు వంటి అనేక పన్నుల రాయితీలు బడా పెట్టుబడులకు ఇస్తున్నది. గత వైసిపి ప్రభుత్వం కూడా ఇచ్చింది. వివిధ పేర్లతో వేల కోట్లు విలువ చేసే ప్రభుత్వ, రైతుల భూములను కూడా ప్రభుత్వం బలవంతపు భూసేకరణ చేసి ప్రైవేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నది. కానీ భూబదలాయింపుకు పెట్టుబడిదారులు చెల్లించాల్సిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ చార్జీలు, నాలా వంటి చార్జీలను కూడా ప్రభుత్వం మినహాయిస్తున్నది. ఈ సంస్థలకు రోడ్లు, రైల్వే లైన్ల అనుసంధానం, విద్యుత్, మంచినీరు సదుపాయం కొరకు రాష్ట్ర ప్రభుత్వమే తన బడ్జెట్ ఆదాయం నుండి వేల కోట్లు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నది. ఇవిగాక ఉత్పత్తి ప్రోత్సాహకాలు పేర కూడా ఎదురు నిధులను పెట్టుబడిదారులకు ఇస్తున్నది. ఫలితంగా రాష్ట్ర ఖజానా వేల కోట్లు పన్నుల ఆదాయం కోల్పోతున్నది. మైనింగ్ విచ్చలవిడి దోపిడీతో వేల కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది.

సామాన్య ప్రజల నుండి మాత్రం ముక్కు పిండి పన్నులు వసూలు చేయడం, పన్నులు పెంచడం చేస్తుంది. ఈ ఏడాది ఏకంగా మద్యం ద్వారా రూ. 27097 కోట్లు రాబట్టాలని నిర్ణయించింది. మొత్తంగా ఈ ఏడాది అదనంగా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.17 వేల కోట్లు రాబట్టాలని నిర్ణయించింది. ఒక వైపు వేల కోట్లు బడా పెట్టుబడిదారులకు పన్ను రాయితీలతో పాటు ఖజానా నుండి వేల కోట్లు నిధులను వీరి ప్రయోజనాలకు ధారాదత్తం చేస్తూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై రకరకాల పన్ను భారాలు మోపుతూ ప్రజల కష్టార్జితాన్ని లూటీ చేస్తున్నది. రూ.17 వేల కోట్లకు పైగా విద్యుత్ చార్జీల భారాన్ని కూడా ఈ ఏడాది కాలంలోనే మోపింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీపై ఆధారపడి ఉంది. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర బిజెపి కి మద్దతు ఇస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారు. గత ఏడాది కాలంలో రాష్ట్రానికి అదనంగా ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం నిధులివ్వలేదు. రాష్ట్ర రెవెన్యూ లోటు భర్తీ కూడా నిలిపేసింది. విభజన చట్టంలో పేర్కొన్న రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలన్నింటిని దెబ్బతీసింది.

కేంద్ర పన్నుల నుండి రాష్ట్రానికి 15వ ఆర్థిక సంఘం ప్రకారం 41 శాతం వాటా నిధులు రావాలి. కానీ 30 శాతం కూడా గత ఏడాది ఇవ్వలేదు. 2023–24లో రూ.45711 కోట్లు ఇవ్వగా 2024–25లో రూ.36869 కోట్లకు కోత పెట్టారు. కేంద్ర ప్రాయోజిత పథకాల గ్రాంట్లు చూస్తే ఇదే కాలంలో రూ. 34,698 కోట్ల నుండి 20,135 కోట్లకు దిగ కోశారు. గడిచిన ఏప్రిల్ %–% జూన్ మూడు నెలల్లో కేంద్రం నుంచి వచ్చిన నిధులను చూసినా గత ఏడాదికి భిన్నంగా లేదు. కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటా కింద రూ. 8443 కోట్లు, గ్రాంట్ల కింద అయితే అత్యంత దారుణంగా కేవలం రూ.1465 కోట్లు మాత్రమే ఇచ్చింది. గత పదేళ్లలో కేంద్ర పన్నుల నుండి రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సిన నిధుల్లో ఆంధ్ర రాష్ట్ర వాటా 5 శాతం నుండి 4.04 శాతానికి పడిపోయింది.

కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రం ఎడల ప్రదర్శిస్తున్న దారుణమైన నిధుల వివక్షతపై తెలుగుదేశం కూటమి కనీసం పన్నెత్తి మాట మాట్లాడటంలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప ఏ మాత్రం వత్తిడి చేయడం లేదు. అమరావతి రాజధాని నిర్మాణానికి మొదటి దశలో రుణ రూపంలో ఇచ్చిన నిధులను రెండో దశలో కనీసం గ్రాంట్ల రూపంలో ఇవ్వాలని ఆర్థిక మంత్రిని ప్రాధేయపడినా నిర్మలా సీతారామన్ నుండి కనీస స్పందన లేదు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వడ్డీ లేని రుణాలను కనీసం ఈ ఏడాది రూ.10 వేల కోట్లు ఇవ్వాలని మోడీ ప్రభుత్వాన్ని కోరుతున్నది. ఈ నిధులు అత్యంత ప్రమాదకరమైనవి. ప్రైవేటీకరణ సంస్కరణలకు ముడి పెట్టి ఇచ్చే రుణాలివి. గత వైసీపీ ప్రభుత్వం ఈ రుణాలు తీసుకొని విద్యుత్ సంస్కరణలు, కార్మిక చట్టాలలో మార్పులు, ఆస్తి పన్నును ఆస్తి విలువకు ముడిపెట్టి పెంచడం, భూ సర్వే, భూ రికార్డులు డిజిటలైజేషన్, ఒకే కార్డు ఇలా అనేక ప్రజా హానికర విధానాలు అమలులోకి తీసుకొచ్చి ప్రజలపై భారాలు మోపిన విషయం తెలిసిందే. వీటిని ప్రతిపక్షంలో వుండగా తెలుగుదేశం పార్టీ తీవ్రంగా విమర్శించింది. అధికారం చేపట్టాక విషమ షరతుల అమలుకు చంద్రబాబు ప్రభుత్వం పూనుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను గత వైసిపి ప్రభుత్వం గుడ్డిగా అమలుచేసి ప్రజా వ్యతిరేకతను కొని తెచ్చుకుంది. అదే దారిలో టిడిపి కూటమి ప్రభుత్వం మరింత దూకుడుగా వెళ్తోంది.

ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చులు పెరిగి పోతున్నాయని వాపోతున్నది. రాష్ట్ర సొంత ఆదాయంలో 90 శాతం ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, వడ్డీలకే సరిపోతున్నదని, గత ప్రభుత్వం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ప్రచారం చేస్తూ ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలుకు నిరాకరిస్తున్నది. సూపర్ సిక్స్ పథకాలలో మహిళలకు ఉచిత బస్సు, మహిళా నిధి, నిరుద్యోగ భృతి వంటివి నేటికీ అమలు చేయలేదు. గత ఏడాది తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలు కూడా అమలు చేయలేదు. ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు. లక్షల సంఖ్యలో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచడంలేదు. కార్మికుల కనీస వేతనాలు పెంచకుండా శత్రుపూరిత వైఖరి అనుసరిస్తున్నది. ఆఖరికి పొగాకు, మిర్చి, మామిడి, పత్తి, పామాయిల్ వంటి అనేక పంటల ధరలు దారుణంగా పడిపోయాయి. రైతులను ఆదుకోవడానికి కనీస మద్దతు ధర ప్రకటించి వాటి కొనుగోలుకు అవసరమైన నిధులు ఇవ్వటానికి కూడా ఈ ప్రభుత్వం ముందుకు రావటం లేదు. కేంద్రంపై వత్తిడి కూడా చేయడంలేదు.

ఇక ప్రభుత్వ అభివృద్ధి వ్యూహం మొత్తం ప్రైవేట్ పెట్టుబడుల ప్రయోజనాలు చుట్టూ ఉంది. నిధుల వినియోగంలో ప్రజా దృక్పథం లేదు. ఈ ఆర్థిక నమూనా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచకపోగా పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖజానా నిధులు, సహజ వనరులు, ప్రజా ఆస్తులు, సదుపాయాలు, మౌలిక సదుపాయాలను పెట్టుబడిదారుల పరం చేస్తున్నది. రాష్ట్రాన్ని మరింతగా అప్పుల ఊబిలోకి దించుతున్నది. నిరుద్యోగం, అసమానతలు పెంచుతున్నది. ఈ విధానం రాష్ట్రానికి, ప్రజలకు అత్యంత ప్రమాదకరంగా మారింది.

# రైతుల హామీలు నెరవేర్చేదాకా వదిలి పెట్టం

## -బిజేపి కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** ఎన్నికల సందర్భంలో రైతులకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టమని బిజెపి కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రూ.2లక్షల రుణమా ఫీకోసం 60శాతం మంది రైతులు 19నెల లుగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఖరీఫ్, రబీ కలుపుకుని ఎకరాకు ప్రతీ ఏడాది రూ.15వేలు చెల్లిస్తామని చెప్పి మొహం చాటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు పంటలకు ఎగనామం పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6వేల చొప్పున చెల్లించి రైతుల ఊసురు పోసుకున్నదని అన్నారు. పంటల భీమాయోజన పథకాన్ని అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీతో పాటు వరి, మొక్కజొన్న, పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలని, రైతుభరోసా ఎకరాకు రూ.15 వేలు, కౌలు రైతులకు కూడా రైతుభరోస వర్తింపజేయాలని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, నకిలి విత్తనాలు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రిక పరికరాలు అందించాలని, పండ్లతోటల రైతులను ఆదుకోవాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ డిక్లరేషన్ అమలు పరిచేవరకు కాంగ్రెస్ పార్టీ వెంటపడుతామని హెచ్చరి ంచారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదాన ందం, నాయకులు జంగ చక్రధరరెడ్డి, అక్కపెల్లి క్రాంతి, బెజ్జంకి దిలీప్, భూషణవేణి శ్రీనివాస్ గౌడ్, చాట్ల కొండల్, కాసనగట్టు విజయ్, వెంకటేష్ కరుణాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకంతో ఆటో కార్మికులకు గండం

## ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా

**తాండూర్,తెలంగాణ దిశ :** ఒక పథకం రెండు విధాలుగా ప్రభావితం చేస్తుంటే... ఒకరికి ప్రయోజనం, మరొకరికి పాతాళానికి నెట్టే పరిస్థితి తయారవుతుంది. మహాలక్ష్మి పథకం తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ప్రయోజనం కలిగించినా, అదే పథకం కారణంగా వేలాది ఆటో కార్మికుల కుటుంబాలు అంధకారంలోకి నెట్టబడ్డాయి. ఇన్నేళ్లు మా ఆటో శబ్దమే ఊరికి జీవం. కానీ ఇప్పుడు అదే ఆటో నిలిచిపోయింది...మా బతుకు నిశ్శబ్దంగా మారిందంటున్నారు ఆటో డ్రైవర్లు.మహిలలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం రాష్ట్రంలోని లక్షలాది ఆటో కార్మికులకు ఆర్థికంగా గండికొట్టిందని, ఇప్పటికే 87 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తాండూర్ ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా తెలిపారు.

తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉచిత బస్సు పథకం ప్రభావంతో ఆటో వృద్ధి కుంటుపడి కార్మికులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఇప్పటివరకు పరామర్శించ కపోవడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఆర్టీసీకి మహాలక్ష్మి పథకం వల్ల రూ.200 కోట్లు అదనంగా లాభం వచ్చిందని ప్రభుత్వం పండుగ చేసుకుంటుండగా, ఆటో కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారని విమర్శించారు. ఆటో కార్మికులు ప్రభుత్వ ఖజానాకు సంవత్సరానికి రూ.15 లక్షల కోట్లకు పైగా ఆదాయం చేకూర్చుతున్నా, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందన్నారు. 2023 ఎన్నికల మేనిఫెస్టోలో సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయాన్ని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా ఒక్క పైసా ఇవ్వకపోవడాన్ని యూనియన్ నేతలు నిరసించారు. ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలు చెప్పినప్పటికీ, ఆయన చులకనగా స్పందించారని వాపోయారు.

# భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

**జయశంకర్,తెలంగాణ దిశ :** జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. పొంగుతున్న వాగులు, చెరువులు, నదిలోకి వెళ్ళొద్దని తెలిపారు. సెల్ఫీలు, రీల్స్ చేయడానికి వెళ్ళొద్దని పటిష్ట పర్యవేక్షణ చేయాలని అనుమతి లేదని ప్రజలు యంత్రాంగానికి సహకరించాలని తెలిపారు. వర్షంలో విద్యుత్ సబ్ స్టేషన్లు, సెల్ టవర్లు, చెట్ల కింద నిలబడరాదని విద్యుత్ ప్రమాదం జరిగే ఆవకాశం ఉందని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండడంతో విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు తదితర వాటిని తాకరాదని హెచ్చరించారు.వర్షాల కారణంగా చెట్లు కొమ్మలు, వాహనాలు, భవనాలపై విద్యుత్ తీగలు పడే ప్రమాదం ఉండడంతో అలాంటి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.డ్రెయినేజీ, నాలాలు పొంగిపొర్లే ప్రాంతాలు, వరద పారుతున్న సందర్భాలలో పిల్లలను వెళ్లకుండా నియంత్రణ చేయాలని, తగు జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. వాగులు, వంకలు, చెరువుల వద్దకు పిల్లలు, పెద్దలు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. పశిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్నవారు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సహాయం కోసం లేదా ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రజలు కంట్రోల్ రూమ్ నంబర్ 9030632608 కు కాల్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు పిడుగు పడే సమయాల్లో జాగ్రత్తలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కారుమబ్బులు కమ్ముకుని, భారీ శబ్దాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపులు, శబ్దాలు వస్తున్నాయంటే పిడుగులు పడతాయని గుర్తించి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పిడుగుపా టుకు ప్రజలు, పశువులు మరణిస్తున్నారని, ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల్లో, చెట్లకింద ఉండే వారు పిడుగుపాటుకు గురవుతున్నారని తెలిపారు. ప్రజలు పిడుగు పడే అవకాశం ఉన్నప్పుడు బయట తిరగక పోవడం మంచిదని , ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు బయటకు వెళ్లక కుండా ఇంటిపట్టునే ఉండాలని ఉరుములు, మెరుపులు వస్తున్నప్పుడు బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని,లోహపు వస్తువులను చేతిలో పట్టుకోవడం మంచిది కాదని తెలిపారు. చెట్లకింద, విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదన్నారు. కాబట్టి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఉరుములు,మెరుపులు వస్తున్న పుడు నదుల్లో, వాగుల్లో, చెరువుల్లో స్నానం చేయడం మంచిది కాదని, భూమిమీద అరికాళ్లు పూర్తిగా పెట్టకుండా వేళ్ల మీద కూర్చోవాలని అ న్నారు.పిడుగు పడినప్పుడు విద్యుత్ ప్రభావం ఎక్కువగా పడే అవకాశం ఉంటుంది కాబట్టి ముడుచుకుని కూర్చోవాలన్నారు.మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకుని కూర్చోవడం వల్ల పిడుగు పడినప్పుడు వెలువడే విద్యుత్ ప్రభావం తక్కువగా ఉంటుందని వివరించారు.

# ప్రతి రోజూ పావనం.. శ్రావణ మాసం



శ్రావణం వర్షాలు తీసుకొస్తుంది. హర్షాతిరేకాలను మోసుకొస్తుంది. ఈ మాసం ఆగమనంతో మేఘాలు వర్షిస్తాయి. చెరువులు, కుంటలు నిండుతాయి. పంటలు ప్రాణాలు పోసుకుంటాయి. ఇది ప్రకృతిలో కనిపించే మార్పు. ఆధ్యాత్మిక ప్రపంచంలో శ్రావణం ప్రత్యేకమైనది. ఈ నెలలో ప్రతిరోజూ ఏదో ఒక పర్వం పలకరిస్తుంది. పండుగలకైతే కొదువే ఉండదు. లక్ష్మీదేవి అనుగ్రహానికి అనువైన మాసం ఇది. మంగళగౌరీ ఆశీస్సులు పొందడానికి ఇదే ఉత్తమ సమయం. తరలి వస్తున్న శ్రావణం శివారాధనకు, శ్రీకృష్ణభగవానుడి సేవకూ సిద్ధమవ్వాలని చెబుతున్నది.

నకోపి వాసరోయత్ర వ్రత శూన్యః ప్రదృశ్యతే
ప్రాయేణ తిథయశ్చాపి వ్రతవత్యోత్ర మాసివై'

శ్రావణంలో వ్రతం లేని రోజు లేదు. ప్రతి వారమూ పవిత్రమైందే. ప్రతి తిథి విశేషమైందే. ఆధ్యాత్మిక చైతన్యంతో లౌకిక జీవనాన్ని సంస్కరించుకునే పవిత్ర మాసం ఇది. వరలక్ష్మి వత్రం, మంగళగౌరి వ్రతం, శ్రావణ మాస వ్రతం, శివ వ్రతం, జీవంతికాదేవీ వ్రతం, నారసింహ వ్రతం, ఆంజనేయ వ్రతం.. ఇలా వివిధ తిథి, వారాల్లో నెల పొడవునా నిత్యం ఏదో ఒక వ్రతం ఉంటుంది. శ్రావణాన్ని శివరూపంగా పేర్కొన్నది స్కాంద పురాణం. 'ద్వాదశేష్వపి మాసేషు, శ్రావణః శివరూపకః' అంటే.. 'పన్నెండు నెలల్లో సాక్షాత్తూ నేనే శ్రావణ మాసాన్ని' అని పరమేశ్వరుడే స్వయంగా సనత్కుమార మహర్షికి చెబుతాడు. అంతేకాదు, మిగతా నెలల్లో అనుష్ఠానం చేస్తే సంప్రాప్తించే ఫలితం.. శ్రావణంలో శ్రవణ మాత్రంతో (వినడంతోనే) కలుగుతుందని పురాణ కథనం.

**నెలంతా వ్రతమే:** ఈ నెలలో శ్రావణ మాస వ్రతం (నక్త వ్రతం) ఆచరిస్తారు కొందరు. శ్రావణ శుద్ధ పాడ్యమి మొదలు బహుళ అమావాస్య వరకు వ్రతం కొనసాగిస్తారు. ఈ నెల రోజులపాటు ఈశ్వరారాధనను చేస్తూ ఉపవాసం ఉంటారు. రాత్రి పూట మాత్రమే భోజనం చేస్తారు. బ్రహ్మచర్యం పాటిస్తూ, నేలపైనే నిద్రిస్తారు. సాధన సంపత్తిని పెంచుకోవడానికి, ఈశ్వర అనుగ్రహం సంపాదించడానికి శ్రావణ వ్రతం చేస్తారు.

**ప్రతిరోజూ పర్వమే..:** శ్రవణం శ్రీమహావిష్ణువు జన్మ నక్షత్రం. శ్రీమహావిష్ణువు అర్ధాంగి అయిన శ్రీమహాలక్ష్మిని ప్రత్యేకంగా అర్చించడం కూడా ఈ మాసంలో కనిపిస్తుంది. పరిశీలన చేస్తే లక్ష్మీదేవి, మహావిష్ణువు అనుగ్రహం పొందడానికి వీలైన మాసం ఇది. వేదాలను కాపాడటానికి శ్రీమహావిష్ణువు హయగ్రీవునిగా అవతారం ధరించింది ఈ నెలలోనే. అందువల్ల ఈ నెలలో వేద గ్రంథ ముద్రణకు సహకరించడం పుణ్యప్రదం. కనీసం వేద విద్యార్థులకు గ్రంథాలు దానం చేసినా శ్రీమహావిష్ణువును సేవించిన ఫలితం కలుగుతుందని

**పెద్దల మాట.:** శ్రావణ సోమవారాల్లో మహాశివుడికి అభిషేకాలు, అర్చనలు చేయాలి. కాశీ, ఉజ్జయిని, సోమనాథ్ వంటి శైవక్షేత్రాలు.. శ్రావణ సోమవారాల్లో భక్తులతో కిటకిటలాడుతాయి. ఈ రకంగా శివ కేశవ అభేదాన్ని ఈ మాసం చాటుతుంది. శ్రీకృష్ణపరమాత్మ అవతరించింది శ్రావణంలోనే. గరుత్మంతుడు అమృతభాండాన్ని సాధించింది కూడా ఈ నెలలోనే. శ్రావణంలో ఒక్కో రోజు ఒక్కో దేవతను పూజించాలని శాస్త్రం సూచించింది. ఈ ప్రకారం శ్రావణ సోమవారాల్లో పరమేశ్వరుడుబీ మంగళవారాల్లో గౌరీ వ్రతం లేదా అర్చనలుబీ బుధవారం విఠలేశ్వరుడుబీ గురువారాల్లో గురుదేవుడుబీ శుక్రవారాల్లో లక్ష్మీదేవి లేదా తులసి పూజలుబీ శనివారాల్లో శనీశ్వరుడు, వేంకటేశ్వరుడు, ఆంజనేయ స్వామికి విశేషంగా అర్చనలు చేయాలని పేర్కొన్నారు.

**వ్రతాలు.. అర్చనలు..:** శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం: ఈ మాసంలో వచ్చే శ్రవణ నక్షత్రం రోజున శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వారి వ్రతం చేయాలని చెబుతారు. స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణం ఉన్ననాడు ఈ వ్రతం ఆచరిస్తే అత్యంత శుభఫలితాలు కలుగుతాయని విశ్వాసం. మంగళగౌరీ వ్రతం: శ్రావణంలో ప్రతి మంగళవారం ముత్తయిదువులందరూ విధి నియమాలు, ఆచారాల ప్రకారం మంగళగౌరీ దేవిని భక్తిశ్రద్ధలతో అర్చించి, వ్రతం చేస్తారు. ప్రత్యేకించి, నూతన వధువులు ఈ వ్రతాన్ని తప్పకుండా ఆచరిస్తారు. దీనిని శ్రీకృష్ణుడు ద్రౌపదికి చెప్పాడని పురాణ కథనం. శ్రావణంలో నెల రోజులు పగటిపూట నిద్రించకూడదు. ఒక పూట మాత్రమే భోజనం చేసి, మంగళగౌరీ దేవిని అర్చిస్తే సకల శుభాలు, మాంగళ్య సౌభాగ్యం కలుగుతాయి.

**శ్రీ వరలక్ష్మీ వ్రతం :** శ్రావణమాసం అనగానే గుర్తుకువచ్చే వ్రతం ఇది. పౌర్ణమికి ముందుగా వచ్చే శుక్రవారం రోజున ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ఏ కార్యానికైనా 'సిద్ధి' ప్రధానం. అది లేకపోతే కార్యానికి ప్రయత్నమే ఉండదు. అందుకే 'సిద్ధి' అనేది మొదటి లక్ష్మి. ఈ దేవత అనుగ్రహం కలిగితే కార్యభారం నుంచి విముక్తులవుతాం. ఆ ముక్తి.. 'మోక్షలక్ష్మి'. ప్రతికూల పరిస్థితులను దాటడమే 'జయలక్ష్మి'. కార్యసాధనకు కావలసిన తెలివితేటలు, సమయస్ఫూర్తి, నిర్ణయశక్తి, విజ్ఞానం మొదలైనవి 'విద్యాలక్ష్మి'. అంటే 'సరస్వతి'. ఈ సరస్వతి ఫలితంగా పొందే సంపద, ఆనందం 'శ్రీలక్ష్మి'. దానివల్ల కలిగే శ్రేష్ఠత్వం, ఉన్నతి 'వరలక్ష్మి'. 'వర' అంటే శ్రేష్ఠమైన అనే అర్థం ఉంది. ఈ శ్రేష్ఠత లక్ష్మీ స్వరూపం. శ్రేష్ఠమైన/ ఉన్నతమైన లక్ష్మి (సంపద)ని పొందడమే అందరికీ చివరి గమ్యం. శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ దేవిని అర్చించి, శాస్త్ర నియమానుసారంగా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తే సకల సౌభాగ్యాలూ సిద్ధిస్తాయి.

## ఉపాధ్యాయురాలు కాదు.. మార్గదర్శక దేవత..!



నల్లగొండ: పట్టణాలకు దగ్గరగా పని చేయాలని చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆశపడతారు. కానీ, రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన లావూరి ఉషారాణి మాత్రం పూర్తి భిన్నంగా ఆలోచిస్తూ మారుమూల గ్రామంలో సేవలందిస్తూ, ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో నిస్వార్థ సేవకు నిదర్శనంగా నిలుస్తున్నారు. 2012లో SGTగా నియామకమైన ఉషారాణి, తన విద్యా ప్రతిభతో 2022 వరకు ఘట్టుప్పల్ ZPHSలో బయో సైన్స్ టీచర్‌గా పనిచేశారు. అనంతరం చందంపేట మండలంలోని కాట్రావత్ తండా ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. అక్కడ విద్యార్థుల కొరత కారణంగా ప్రస్తుతం డిప్యూటేషన్ పై గాగిల్లపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఉషారాణి గాగిల్లపురం గ్రామంలోనే అద్దె ఇల్లు తీసుకుని నివసిస్తున్నారు. తన కుమార్తెను కూడా తానే బోధించే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదువిస్తున్నారు. ఇది విద్యపై ఆమె నమ్మకాన్ని, ప్రభుత్వ పాఠశాలల పట్ల గల విశ్వాసాన్ని చూపుతుంది. విధుల అనంతరం సమయాన్ని వృథా చేయకుండా, గ్రామానికి చెందిన విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పడం ద్వారా అనేకమంది చిన్నారులకు విద్యలో ఆసక్తి కలిగిస్తూ, వారి జీవితాలపై సానుకూల ప్రభావం చూపుతున్నారు. లావూరి ఉషారాణి మాదిరి ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్య వ్యవస్థకు ప్రాణాలుగా నిలుస్తూ, ఆదర్శంగా నిలుస్తున్నారు అనడంలో సందేహమే లేదు. ఆమె సేవలు మరెంతో మంది ఉపాధ్యాయులకు ప్రేరణగా మారాలని ఆశిద్దాం.

### మా కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న....ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట అస్సాం రాష్ట్రం గుహవాటిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మా కామాఖ్య అమ్మవారి దేవాలయాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు ఘనమైన స్వాగతం పలికారు మరియు అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు.

## ఆదిలాబాద్‌లో యూరియా కోసం రైతుల తిప్పలు..





**ఆదిలాబాద్,తెలంగాణ దిశ :** రాష్ట్రంలో అన్నదాతలకు యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. ఓవైపు వర్షాలు పడుతున్నా రైతులు లైన్లలో నిల్చుంటున్నారు. తాజాగా ఆదిలాబాద్‌లో అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ముందు యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నడంతో రైతులు ఎరువుల కోసం విక్రయ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు.. ఉదయం ఆదిలాబాద్ సొసైటీకి భారీ సంఖ్యలో రైతులు ఎరువుల కోసం వచ్చారు. 440 యూరియా సంచులు మాత్రమే పంపిణీ చేసిన అధికారులు మిగతా రైతులు మిగతా రైతులను ప్రైవేటు డీలర్ల వద్దకొనుగోలు చేయాలని సూచించారు. దీంతో రైతులు ప్రైవేట్ దుకాణం డీలర్ల వద్ద వెళ్లి కొనుగోలు చేశారు. వానలోనూ యూరియా యాతన: రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కుతున్నారు. బుధవారం కురిసిన వర్షంలోనూ రైతులు పలుచోట్ల బారులుతీరారు. మంచి ర్యాల కోటపల్లి మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా క్యూకట్టారు. కోటపల్లిలోని పీఏసీఎస్‌లోని యూనియా పంపిణీ కేంద్రానికి రైతులు బుధవారం ఉదయమే చేరుకున్నారు. వర్షంలో తడుస్తూ పడిగాపులు కాశారు. ఎకరానికి ఒక్క బస్తా మాత్రమే ఇవ్వడంతో రైతులు నిరాశకు గురయ్యారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీలోని పొగుళ్లపల్లి సొసైటీ వద్ద వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు గొడుగులు పట్టుకొని, కవర్లు వేసుకొని క్యూలో నిలబడ్డారు.

## నాగబాబుకు మంత్రి పదవి ఇంకా టైముంది..



విజయవాడ,: జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు మంత్రి పదవిపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన పవన్ కళ్యాణ్.. నాగబాబు మంత్రి పదవిపై క్లారిటీ ఇచ్చారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తారంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా ఇచ్చిన సంగతి తెలిసిందేజనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబుకు మంత్రి పదవి అంటూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో, మెయిన్ స్ట్రీమ్ మీడియాలో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నాగబాబుకు మంత్రి పదవి వార్తలు వస్తూనే ఉన్నాయి. ఎన్నికల సమయంలో అనకాపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని నాగబాబు భావించారు. అయితే కూటమి పొత్తుల లెక్కల్లో ఆ స్థానం బీజేపీకి వెళ్లగా.. సీఎం రమేష్ అనకాపల్లి ఎంపీగా గెలుపొందారు. అయితే పోటీ చేసే అవకాశం దక్కకపోయినప్పటికీ.. జనసేన అభ్యర్థుల తరుపున, పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయానికి నాగబాబు కృషి చేశారు. ఇక ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలుపొంది అధికారంలోకి రావటంతో నాగబాబుకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారంటూ వార్తలు వచ్చాయి. టీటీడీ ఛైర్మన్ చేస్తారని ఒకసారి.. మంత్రి పదవి ఇస్తారని మరోసారి ఇలా రకరకాల కథనాలు వచ్చాయి. చివరకు ఈ కథనాలకు చెక్ పెడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామంటూ టీడీపీ ప్రకటన కూడా ఇచ్చింది. 2024 డిసెంబర్ నెలలో ఏపీ నుంచి ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ప్రకటించిన సందర్భంలో.. నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు టీడీపీ ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి నాగబాబును రాజ్యసభకు పంపుతారని వార్తలు రాగా.. బీజేపీ నుంచి ఆర్. క్రిష్ణయ్య, టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్‌లను రాజ్యసభకు పంపారు. దీంతో నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటామని టీడీపీ ప్రకటించింది. అయితే ఈ ప్రకటన వచ్చి సుమారు ఏడు నెలలు గడుస్తున్నా నాగబాబుకు మంత్రి పదవి మాత్రం దక్కలేదు. అయితే ఈలోపే నాగబాబును ఎమ్మెల్సీని చేశారు. దీంతో మంత్రివర్గంలోకి మార్గాన్ని సుగమం చేసింది కూటమి. అయితే ఎప్పుడు నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకుంటారనే దానిపై తాజాగా పవన్ కళ్యాణ్ క్లారిటీ ఇచ్చారు. ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగబాబుకు మంత్రి పదవిపై పవన్ కళ్యాణ్ పెదవి విప్పారు. నాగబాబుకు మంత్రి పదవిపై ఇప్పటిదాకా చర్చ జరగలేదన్న పవన్ కళ్యాణ్.. ఈ అంశం గురించి సీఎం చంద్రబాబు ఇప్పటికే తన నిర్ణయం వెల్లడించారని అన్నారు. అయితే ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది తానేనని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. రాజకీయాల్లో కొన్నిసార్లు ఇబ్బందులు తప్పవన్న జనసేనాని.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు చెప్పుకొచ్చారు.

## మేడారంలో ఏం జరుగుతోంది..?

**వరంగల్,తెలంగాణ దిశ :** సరిగ్గా ఏడాది క్రితం తెలంగాణ రాష్ట్రంలోని మేడారంలో ప్రకృతి ఒక్కసారిగా పడక విప్పింది. మేడారంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో హోరుమని గాలులు వచ్చాయి. చూస్తుండగానే వందలాది వృక్షాలు నేలకు కూలిపోయాయి. వర్షాలు విపరీతంగా కురిసాయి. తద్వారా మేడారం పరిసర ప్రాంతాలన్నీ ధ్వంసం అయ్యాయి. ఈ వర్షాన్ని, హోరుగాలిని మర్చిపోకముందే భూకంపం వచ్చింది. భూకంపం తాకిడికి మేడారం సమ్మక్క, సారక్క గద్దెలు ఊగిపోయాయి. ప్రాణ నష్టం చోటు చేసుకోకపోయినాప్పటికీ.. ఆస్తి నష్టం సంభవించకపోయినప్పటికీ భూకంపం మాత్రం ప్రజలను భయకంపితులను చేసింది. మేడారం సంఘటన యాదృచ్ఛికంగా జరిగిందా.. ఇంకా ఏదైనా దాని వెనక ఉందా.. అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లభించలేదు. మేడారం ఘటన అలా ఉండగానే ఈ సంవత్సరం వర్షాకాలంలో ఇప్పటివరకు దేశంలో అలాంటి ఘటనలు కొన్ని ప్రాంతాలలో చోటుచేసుకున్నాయి. గడచిన నాలుగు నెలల్లో మనదేశంలో పలు ప్రాంతాలలో ప్రకృతి ఒకసారిగా తన ఉగ్రరూపాన్ని చూపించింది.. బీభత్సమైన గాలులు.. అదే స్థాయి వర్షాలతో ఆ ప్రాంతాలను అతాలకు తలం చేసింది. దాదాపు ఏప్రిల్ ఒకటి నుంచి జూలై 16 వరకు దేశంలో పలు ప్రాంతాలలో చోటుచేసుకున్న భారీ వర్షాల వల్ల ఏకంగా 1297 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రకృతి విపత్తుల వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధికంగా 258 మంది చనిపోయారు. హిమాచల్ ప్రదేశ్ లో 171 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. మధ్యప్రదేశ్లో 148 మంది, బీహార్ రాష్ట్రంలో 101 మరణాలు చోటుచేసుకున్నాయి.. ఇక పశువులయితే దాదాపు 51 699 చనిపోయాయి.. 92,663 గృహాలు



దెబ్బతిన్నాయి. దాదాపు 154, 394 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్న ప్రాంతాలలో అటవీ విధ్వంసం ఇష్టారాజ్యంగా సాగిపోతోంది. రోడ్లు, ప్రాజెక్టులు, ఇలా రకరకాల వాటి పేరుతో ఆ ప్రాంతాలలో ఉన్న అడవులను ధ్వంసం చేస్తున్నారు.. దీంతో జీవవైవి ద్యం క్రమంగా అదుపుతప్పుతోంది. దీంతో ఆ ప్రాంతాలలో ప్రకృతి విపత్తులు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. ఈ ప్రాంతాలలో వర్షాలు, భీకరమైన గాలులు మాత్రమే కాదు భూకంపాలు కూడా వచ్చే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు..” ఈ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా రు. గతంలో ఇక్కడ పచ్చటి అడువులు ఉండేవి. ఇప్పుడు అవి మాయ మయ్యాయి. జంతువులు కూడా కాలగర్భంలో కలిసిపోయాయి. దీంతో బయోడైవర్సటీ మొత్తం సర్వనాశనమైంది. అందువల్లే ఈ ప్రాంతాలు ప్రకృతి నుంచి తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి..

## లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షలు చేయాలి

**– జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** సీజనల్ వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోనిఆయుష్ ఆసుపత్రిని పరిశీలించి, నూతనంగా నిర్మాణం జరుగుతున్న 100 పడకల ఆసుపత్రి పనులు , నిర్మాణం పూర్తి చేసుకున్న తాత్కాలిక క్యాజువాలిటిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఆసుపత్రి వెనుక ఉన్న చిన్న సందు విస్తరించి అక్కడి నుంచి పేషెంట్ తరలింపు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.



వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా కేసులు తప్పనిసరిగా రిపోర్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్.ఎం.ఓ డాక్టర్ విజయ్, నర్సింగ్ సూపర్డెంట్ జమున సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ- పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు తీర్చండి

**గన్నేరువరం,తెలంగాణ దిశ**ఈ - పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు వివరిస్తూ గన్నేరు వరం ఎంపీడీవో శ్రీనివాస్ కు కంప్యూటర్లు రాజశేఖర్,శివ సాయి, శంకర్, పద్మ వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ లో పనిచేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్ల జీతాలు సకాలంలో చెల్లించాలని, గత నాలుగు సంవత్సరాల నుండి నేలసరి వేతనం 22,750 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని, ఈ తరుణంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించే క్రమములో నెలసరి వేతనం 19,500 మాత్రమే చెల్లించడం జరిగిందన్నారు. కాగా తమ జీతాలు సకాలంలో చెల్లించి , ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.కావునా ఎప్రిల్, మే, జూన్ నెలల పెండింగ్ వేతనాలు 3250 తక్కువగా ఉన్నాయని వెంటనే చెల్లించేలా చూడాలని కోరారు.ఔట్ ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా ఖాతాల్లో నేరుగా నగదు జమ చేయాలని కోరారు.

# తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమం

న్యూఢిల్లీ, : తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఉద్ఘాటించారు. తెలంగాణ సర్వే ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యాసంస్థల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సిఫారసు చేస్తోందని తెలిపారు. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం కోసం ఎదురు చూస్తోందని వెల్లడించారు. ఈ చారిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలోని బృందానికి మల్లికార్జున ఖర్గే కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ-సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ఖర్గే ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మల్లికార్జున ఖర్గే పోస్ట్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమని నొక్కిచెప్పారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతర పోరాటం చేస్తోందని ఉద్ఘాటించారు. దశాబ్దాలుగా పక్కకు నెట్టివేయబడిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గళంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు.దేశ జనాభాలో మెజార్టీ సంఖ్య అయినా... కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యాసంస్థల్లో వర్ణహీనత కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లో కూడా అన్యాయం జరుగుతోందని.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావించారని గుర్తుచేశారు. 80 శాతం ఓబీసీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అలాగే 83 శాతం ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఒత్తిడికి లోనై కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని... కానీ 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎందుకు తొలగించలేదని మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు.

# ఇక ఫుల్ టైమ్ పాలిటిక్స్...



విజయవాడ,: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సినిమాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారు. ఆయన ఇక రాజకీయాల్లో పూర్తి కాలం కొనసాగేందుకే నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అందుకే నిన్న హరిహరవీరమల్లు ప్రీ రిలీజ్ ఫంక్షన్ లో గాని, మీడియా సమావేశంలో కాని ఇకపై తాను సినిమాలు చేయకపోవచ్చని చెప్పారు. పవన్ ఫ్యాన్స్ కు నిజంగా నిరాశ పర్చే వార్తే. ఎందుకంటే అతి తక్కువ సినిమాలు చేసి ఎక్కువ అభిమానులను సంపాదించుకున్న పవన్ కల్యాణ్ కు నిజజీవితంలో సినిమాలపై ఆసక్తి లేదు. ఆయన ఎక్కువ కాలం ప్రజాసేవ చేయాలని నిర్ణయించుకుని జనసేన పార్టీ 2014లో ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో దారుణ ఓటమికి గురి కావడంతో ఆయన మనసును మళ్లించుకోవడానికి కొంత కాలం సినిమాల వైపు మళ్లించారు. 2019 ఎన్నికల ఫలితాల వెంటనే... 2019 ఎన్నికలు జరిగిన తర్వాత వెనువెంటనే రాజకీయాల్లో తన పరిస్థితి ఏంటో పవన్ కల్యాణ్ తాను తెలుసుకున్నారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోనూ కమల్ హాసన్ వంటి స్టార్లు రాజకీయాల్లో రాణించలేకపోవడం, రాజకీయాల్లోకి వచ్చేందుకు అన్నీ సిద్ధం చేసుకుని వెనక్కు తగ్గిన రజనీకాంత్ ను చూసిన తర్వాత పవన్ కల్యాణ్ ఆలోచనల్లో మార్పు వచ్చిందని చెబుతున్నారు. తాను కీలక పదవిలో లేకపోయినా ఏపీ రాజకీయాల్లో ముఖ్య భూమిక పోషించాలన్న భావనతో ఆయన 2019 ఎన్నికల తర్వాత ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో జత కట్టారు. అయితే ఏపీలో బీజేపీకి పెద్దగా ఓటు బ్యాంకు లేకపోవడంతో ఆయన టీడీపీతో సన్నిహితంగా మెలగాలని కోరుకున్నారు. జగన్ ను ఓడించాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్నా పార్టీ మద్దతు అవసరం. ఓటు బ్యాంకు లేకపోయినా ఎలక్షనీరింగ్ చేయాలంటే బీజేపీ సహకారం అవసరమవుతుందని గ్రహించారు. ఇక టీడీపీ విషయానికి వస్తే క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న పార్టీ, ఓటు బ్యాంకు భారీగా కలిగిన పార్టీగా,

యాభై వసంతాల చరిత్ర కలిగిన పార్టీగా దానిని కూడా కూటమిలో కలుపుకుంటే జగన్ ను కొట్టేయవచ్చన్న నమ్మకంతోనే కూటమిని ఏర్పాటు చేసి సక్సెస్ అయ్యారు. ఇక రానున్న కాలంలోనూ కూటమికి తిరుగులేదని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. తాను ముఖ్యమంత్రిగా కాకపోయినా సరే.. చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటయ్యే ప్రభుత్వంలో కీలకంగా మారాలన్నది మాత్రం పవన్ ఆలోచనగా ఉంది. అందుకే పవన్ కల్యాణ్ కూటమిని సజావుగా వచ్చే ఎన్నికల వరకూ మనస్పర్థలు తలెత్తకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక సినిమాలకు స్వస్తి చెప్పి ఫుల్ టైం రాజకీయాల్లోనే ఉంటారట.

మళ్లీ చేయాలంటున్న ఫ్యాన్స్: వర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'హరి హర వీరమల్లు' ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సినిమాకు సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ దాదాపుగా అన్ని ప్రాంతాల్లో మొదలయ్యాయి. ప్రీమియర్ షోస్ బుకింగ్స్ కూడా ఒక్క నైజాం ప్రాంతం లో తప్ప అన్ని ప్రాంతాల్లో బుకింగ్స్ ని మొదలు పెడుతున్నారు. మూడేళ్ళ తర్వాత పవన్ కళ్యాణ్ నుండి వస్తున్న చిత్రం, అది కూడా డైరెక్ట్ సినిమా, అభిమానులతో పాటు ప్రేక్షకులు కూడా ఆయన్ని వెండితెర పై చూడాలని ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే ఎన్నడూ లేని విధంగా పవన్ కళ్యాణ్ ఈ సినిమా ప్రొమోషన్స్ లో చాలా చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈరోజు మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు నాన్ స్టాప్ గా అన్ని నేషనల్ మీడియా చానెల్స్ కి ఆయన ఇంటర్వ్యూస్ ఇచ్చాడు.లోకల్ గా ఉండే ఒక పాపులర్ న్యూస్ ఛానల్ కి ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూ లో అభిమానులకు నచ్చని కొన్ని కామెంట్స్ చేశాడు. అదేంటో ఒకసారి చూద్దాం. ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి అయితే చేతిలో ఉన్న ఈ మూడు సినిమాలను పూర్తి చేసేసాను. ఉస్తాద్ భగత్ సింగ్ మరో ఆరు రోజులు షూటింగ్ చేస్తే అయిపోతుంది. ఓజీ చిత్రం ఇప్పటికే పూర్తి అయ్యింది. ఆ తర్వాత పూర్తిగా రాజకీయాలను నా సమయం కేటాయించాలని అనుకుంటున్నాను. పార్టీ ని క్షేత్ర స్థాయి నుండి బలోపేతం చెయ్యాలి. అదే నా ప్రధాన లక్ష్యం. అయితే సినిమా నా జీవనాధారం. ప్రస్తుతానికి నా వద్ద కథలు ఏమి లేవు. భవిష్యత్తులో నా రాజకీయ కార్యక్రమాలకు క్లాష్ రాకుండా ఉండే పని అయితే సినిమాల్లో నటిస్తాను. లేదంటే నా పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ ని రీ యాక్టీవ్ చేసి సినిమాలను నిర్మిస్తాను' అంటూ చెప్పుకొచ్చాడు పవన్ కళ్యాణ్.

ఆయన మాట్లాడిన ఈ మాటలు అభిమానులను తీవ్రంగా నిరాశకు గురి చేస్తున్నాయి. సమయం తీసుకొని అయినా సినిమా చెయ్యండి అన్నా అంటూ అభిమానులు బ్రతిమిలాడుతున్నారు. కానీ అభిమానులు అర్థం చేసుకోవాల్సినది ఒకటి ఉంది. ఆయన సినిమాలకు దూరం అవుతానని చెప్తాడు కానీ, డబ్బు అవసరం ఆయన్ని సినిమాలు కచ్చితంగా చేయిస్తుంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వెంటనే ఆయన సినిమాలు చెయ్యకపోవచ్చు గాక, కానీ 2027 లేదా 2028 లో ఆయన కచ్చితంగా సినిమా చేయొచ్చు. అభిమానులు అధైర్యపడొద్దు అంటూ సోషల్ మీడియా లో పలువురు విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ రెడీ అంటే సురేందర్ రెడ్డి ప్రాజెక్ట్ సిద్ధంగా ఉంది. మరి దీన్ని ఆయన ఎప్పుడు సెట్స్ మీదకు తీసుకెళ్తాడో చూడాలి

# విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ :** విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. కాటారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే గురుకుల పాఠశాల, గారే పల్లి సహకార పరపతి సంఘం ఎరువులు దుకాణం, జీవన జ్యోతి మండల సమాఖ్య మహిళా శక్తి కుట్టు కేంద్రం, చిల్డ్రన్స్ పార్కు, లక్ష్మి గణపతి, శ్రీ రాజ రాజేశ్వరి ఎరువుల, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో 9వ తరగతి గది, వంటశాల, ఆహారం నాణ్యత, స్టోర్ రూము, కూరగాయలు నిల్వలు, హాజరు పట్టిక, ఆహారం నాణ్యతపై విద్యార్థులు వ్రాసిన ఫీడ్ బ్యాక్, పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందని, విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని స్పష్టం చేశారు. తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను వినియోగించాలని, నాణ్యత, లేని సరుకులు వాపసు చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలు ఓపెన్ గా ఉంచకుండా కప్పి ఉంచాలని సూచించారు. విద్యార్థుల పఠనా సామర్థ్యం, ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులను ఏ సబ్జెక్టు చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. లెక్కలు పీరియడ్ జరుగుతుందని విద్యార్థులు తెలుపగా లెక్కలతో పాటు అన్ని సబ్జెక్ట్ లలో ముందంజలో ఉండాలని సూచించారు. విద్యార్థుల కు ప్రత్యేక తరగతులు నిర్వహించి ముందంజలో ఉండేలా ప్రోత్సహించాలని అన్నారు. ఈ రోజు ఉదయం ఏం టిఫిన్ చేశారు, మంచిగా ఉందా అంటూ విద్యార్థుల ను అడిగారు. బావుందని చెప్పడంతో ఇలానే నాణ్యత పాటించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది రావొద్దని సూచించారు. గారేపల్లిలో నహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణం, లక్ష్మి గణపతి, శ్రీ రాజ రాజేశ్వరి ఎరువుల, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని రైతులు అపోహలు పడొద్దని సూచించారు. ధరలు పట్టిక పరిశీలించారు. ఆధార్ నమోదు చేయాలని, విధిగా కొనుగోలు చేసిన వారికి రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. ఎరువులు, విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించినా, బ్లాక్ మార్కెట్ కు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రద్దీ ఉంటే స్లిప్పులు జారీ చేసి క్రమపద్ధతిలో ఎరువులు ఇవ్వాలని, ఎక్కువ సేపు రైతులు నిరీక్షించకుండా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించారు. పాస్ బుక్ లేని రైతులకు ఆదార్ కార్డు నమోదు ద్వారా ఎరువులు ఇవ్వాలని సూచించారు. జీవన జ్యోతి మండల సమాఖ్య మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలించి మహిళలతో మాట్లాడారు. రోజుకు ఎన్ని జతలు. కుడుతున్నారని, నెలకు ఎంత ఆదాయం వస్తుందని అడిగి తెలుసుకున్నారు. బట్టలు కుట్టుటలో మహిళలకు మెళకువలు నేర్పేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని డిఆర్డీఓకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్స్ తో పాటు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరంతరం కుట్టు పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.చిల్డ్రన్స్ పార్కు పరిశీలించిన జిల్లా కలెక్టర్ చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే మంత్రి శ్రీధర్ బాబు చిన్నారుల పార్కును ప్రారభించి ప్రజలకు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ప్రక్కన ఉన్న ఖాళీ స్థలంలో బ్లాక్ ప్లాంటేషన్ చేపెట్టేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వ్యవసాయ అధికారి బాబు, డీఈఓ రాజేందర్, తహసీల్దార్ నాగరాజు ఎంపిడిఓ బాబు, వ్యవసాయ శాఖ ఈడీఏ శ్రీపాల్, ఎంపీవో వీరస్వామి తదితరులు. పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల పనుల్లో అధికారులు

**రాజమండ్రి,తెలంగాణ దిశ :** గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఘాట్‌లను సుందరీకరిస్తున్నారు. ప్రజలు వచ్చి పుణ్య స్నానాలు చేసి సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు రహదారులను కూడా విస్తరిస్తున్నారు. అయితే అన్నింటి కంటే ముఖ్యమైన రైల్వే స్టేషన్ పునఃనిర్మాణ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అధునాత సౌకర్యాలు కల్పించేందుకు కేంద్రం నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ వర్క్స్ మాత్రం టెండర్ దశ దాటి వెళ్లడం లేదు. రాజమండ్రి రైల్వే స్టేషన్‌ను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కేంద్రం భావించింది. అందుకే అమృత్ భారత్‌స్టేషన్ పథకంలో చేర్చారు. గతంలో ప్రధానమంత్రి మోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. అయితే భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని మరికొన్ని విస్తరణ పనులు చేస్తే ప్రయోజనం ఉంటుందని స్థానిక నాయకులు చెప్పడంతో పనులను రీడిజైన్ చేశారు. దీంతో మొత్తానికి పనులు ఆగిపోయాయి. స్టేషన్ సమగ్ర అభివృద్ధికి ఇప్పటికే రైల్వే మంత్రిత్వ శాఖ 271.43 కోట్లు కేటాయించింది. ప్రధానమంత్రి శంకుస్థాపన చేయడంతో పనులు ఊపందుకుంటాయని అంతా అనుకున్నారు కానీ టెండర్లు దశ దాటి వెళ్లడం లేదు. పుష్కరాల నాటికి పనులు పూర్తి చేయాలని ఈ మధ్య రైల్వే అధికారులను రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి కలిసి రిక్వస్ట్ చేశారు. టెండర్లు ఖరారు చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు 35 వేల మంది ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే గంటలకు దాదాపు పది వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. పశ్చిమ భాగంలో కొత్తగా జీ +3 బిల్డింగ్ నిర్మించాలి. తూర్పు వైపు కూడా జీ+5 భవన నిర్మించారు. ఇక్కడ ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా ప్లాట్‌ఫామ్‌లు నిర్మించాల్సి ఉంది. 17 ఎస్కలేటర్లు, ఏడు లిఫ్టుల నిర్మాణం జరగాల్సి ఉంది. ఫుడ్ ప్లాజాలు, ఇతర దుకాణాలకు నిర్మాణాలు చేపట్టాలి. రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జి కట్టాలి. పార్కింగ్ సౌకర్యాలు అభివృద్ధి చేయాలి. ఇలా చాలా పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి నుంచి వీటిని ప్రారంభించ కుంటే పుష్కరాల కాలం నాటికి పూర్తి కావని స్థానిక ప్రజానీకం అభిప్రాయపడుతున్నారు. అందుకే కచ్చితంగా ప్రారంభించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు

# బిఆర్ఎస్,కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలు

## బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ



**హైదరాబాద్,తెలంగాణ దిశ:**తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ - కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాల అసలైన రూపం బయటపడిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ప్రకటన విడుదల చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం తదితర కేసులపై నత్తనడక విచారణలు రేవంత్ చిత్తశుద్ధిపై అనుమానలు కలుగుతున్నాయని అన్నారు. ఇందులో ఆమె అనేక అంశాలపై తనదైన శైలిలో వివరించారు. రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే 'హైడ్ అండ్ సీక్' రాజకీయ నాటకం కొనసాగుతోందని, రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఫోన్ ట్యాపింగ్, వ్యక్తిగత నిఘా, గోప్యత ఉల్లంఘనలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా ఆరోపణలు చేశారన్నారు. తనతో పాటు తన కుటుంబం ఫోన్లు ట్యాపింగ్ కు పాల్పడ్డారని మాట్లాడారని.. కానీ, ఇప్పుడు ఆయన అవన్నీ మరిచినట్టుగా, ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉంటే తనకు నోటీసులు వచ్చేవి కదా అనే వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. అలాంటప్పుడు గతంలో రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు నాటకమా..? లేక ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీతో కుదిరిన ప్యాకేజీ డీలే కారణమా..? అనే అనుమానం కలుగుతోందని అన్నారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య ప్యాకేజీ బేరాలు కుదిరాయనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని తెలిపారు. కాంగ్రెస్ - బీఆర్ఎస్ పార్టీలు ప్రజల ముందు కేవలం మాటల యుద్ధం చేసుకుంటూ కుమ్ములాటలు చేసుకుంటూ, చీకట్లో ప్యాకేజీలు కుదుర్చుకుంటు-న్న విషయం మరోసారి స్పష్టమైందన్నారు. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణంపై ఇప్పటికే కేంద్ర వ్యవస్థలు సంచలన విషయాలను బయట పెట్టాయన్నారు. ఈ విషయంలో నాడు పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం వేలకోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసి.. అధికారంలోకి వచ్చాక అదే బీఆర్ఎస్ పార్టీకి రక్షణ కవచంగా మారారన్నారు. రూ. 38,000 కోట్లతో ప్రారంబించిన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయం రూ. 1.2 లక్షల కోట్లకు పెంచిన సంగతి తెలిసిందేనని.. వేల కోట్లు- వృథా చేసినట్లు- కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు స్పష్టంగా పేర్కొన్నాయి. ఈ ప్రాజెక్టులో టెండర్ల మంజూరు, పునర్నిర్మాణ ఖర్చులు, నిర్మాణ వైఫల్యాలపై సంపూర్ణ విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అడుగైనా ముందుకు వేయకుండా, ఈ కేసును నీరుగార్చే కుట్రలకే పాల్పడుతోందన్నారు. గత 19 నెలలుగా కాళేశ్వరం అవినీతి దర్యాప్తు పేరుతో కాలయాపన చేస్తూ.. అసలు దోషులను అరెస్ట్ చేయకుండా విమర్శలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఇప్పటి-కై-నా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సీబీఐ విచారణకు కోరి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మాత్రమే కాదు.. కేసీఆర్ ప్రభుత్వంలో వెలుగు చూసిన డ్రగ్స్ కేసులు, విద్యుత్ కొనుగోళ్లలో జరిగిన అవినీతి, ఫార్ములా ఈ రేసింగ్ కేసులో నిధుల మళ్లింపు, ల్యాండ్ స్కాంలు, ఉద్యోగ నియామకాలలో చోటుచేసుకున్న అవకతవకలు.. ఈ కేసులన్నింటిపై విచారణ చేపడతామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు అసలు దోషులను పట్టుకున్న పరిస్థితి లేదన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ కుటుంబంతో కుమ్మక్కై అవినీతికి కవచంగా మారిందని తెలిపారు.

# త్రాగు నీటి సరఫరా పనులను వెంటనే పూర్తి చేయాలి

## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** పెండింగ్ త్రాగు నీటి సరఫరా పనులను యుద్ధ ప్రాతిప దికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సమీ కృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురు వారం త్రాగు నీటి సరఫరాపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. గుం జపడుగు, పుట్టపాక, కమాన్ పూర్, గుండారం, నాగారం, పెంచికల్ పేట, రామగిరి , మస్యాల, బేగంపేట , రత్నా పూర్, కల్వచర్ల, పెద్దరాజ్ పల్లి, ఓదెల , గొల్లపల్లి ప్రాంతంలో పెండింగ్ మిషన్ భగీరథ ఇంట్రా పనుల పురోగతి పై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెండింగ్ మిషన్ భగీరథ ఇంట్రా త్రాగునీటి సరఫరా చిన్న చిన్న పనులను ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. కాంట్రాక్టర్ లను రెగ్యులర్ గా మానిటర్ చేస్తూ పనులు చేయాలని, క్షేత్ర స్థాయిలో పనులు పూర్తి చేసేందుకు ఎదురవుతున్న ఇబ్బందులను తన దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. జిల్లాలో అవసరమైన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ నిబంధన ప్రకారం పూర్తి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వాటర్ ట్యాంకర్ మరమ్మత్తులు, ల్యాడర్స్ నిర్మాణానికి 92 లక్షల మంజూరు చేయడం జరిగిందని, జిపి నుంచి తీర్మానం తీసుకుని ఆ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మన జిల్లాలో రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి ఇన్ ఫ్రా పనులు ఉండకుండా త్రాగునీటి సరఫరా పనులు పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో త్రాగునీటి సరఫరా నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. వానా కాలంలో నీటి లీకేజీలకు త్వరగా క్షేత్రస్థాయి సిబ్బంది స్పందించాలని, నీటి నాణ్యతలు ఎటువంటి ఇబ్బందులు రావడానికి వీలు లేదని అన్నారు. జిల్లాలో ఎక్కడ కలుషిత త్రాగునీరు వస్తుంది, నీటి లీకేజీ జరుగుతుందనే మాట వినపడడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ పూర్ణ చందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తొర్రూర్ మున్సిపల్ డెవలప్మెంట్ వర్క్ పై అడిషనల్ కలెక్టర్ సందర్శన



**తొర్రూరు,తెలంగాణ దిశ :** తోరూర్ మున్సిపాలిటీ డెవలప్మెంట్ వర్క్స్ పై స్పెషల్ ఆఫీసర్ అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో అన్నారం రోడ్డు సమతా కాలేజీ రోడ్డును, డిపో మెయిన్ రోడ్డును, సందర్శించిన అనంతరం తొర్రూర్ మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు, 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా, ప్లాస్టిక్ నివారణ,ఎల్ఆర్ఎస్ హౌస్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్ పై తుర్రు కమిషనర్ శ్యాంసుందర్ ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో మాట్లాడుతూ 15 కోట్లరూపాయలతో డెవలప్మెంట్ చేయాలని ప్రపోజల్స్ రాగా మున్సిపాలిటీ సందర్శించడం జరిగిందని అన్నారు. అలాగే 100 రోజుల యాక్షన్ ప్లాన్ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,టాక్స్ కలెక్షన్ పై కమిషనర్ అడిగి వివరాలు తెలుసుకున్నారు, ప్లాస్టిక్ పై సమరం సాగించాలని ప్లాస్టిక్ను పూర్తిగా నివారించేలా మున్సిపాలిటీలో తగు చర్యలు తీసుకునేలా కమిషనర్ కు సూచనలు జారీ చేశారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వక్కల శ్యాంసుందర్,డి ఈ ఏ ఈ రంజిత్ కుమార్, ఇన్చార్జ్ మేనేజర్ కట్టస్వామి,వార్డ్ ఆఫీసర్లు,సానిటరీ ఇన్స్పెక్టర్ దేవేందర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి ట్రాన్స్పోర్ట్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులకు..

# 5 సంవత్సరాల కఠిన కారాగారా జైలు శిక్ష

### ఒక్కొక్కరికి 10,000 రూపాయల జరిమానా

,గోదావరిఖని : గోదావరిఖని వన్ టౌన్ పరిధిలో ఎంజాయ్ తరలిస్తున్న ఇద్దరికీ 1. ప్రసన్ జిత్ రాయ్, 2. కమలేష్ గోల్డర్ ఇన్స్పెక్టర్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ 2017 వ సంవత్సరంలో ఆర్టీసీ బస్ స్టాండ్ గోదావరిఖని లో పెట్రోలింగ్ చేయుచుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న పై ఇద్దరూ వ్యక్తులను ఆపి వారి వద్ద ఉన్న బ్యాగ్ లను చెక్ చేయగా ఒక్కొక్కరీ వద్ద 5కేజీ ల గంజాయి మొత్తం 10 కేజీ లు దొరికింది, వీరు ఒరిస్సా లో గుర్తు తెలియని వ్యక్తి దగ్గర కొనుగోలు చేసినారు, అప్పటి ఇన్స్పెక్టర్ జి. కృష్ణ ఫ్ ఐ ర్ చేసి కేసును పరిశోధన ప్రారంభించి విచారణ చేసి నేరస్తులను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించడం జరిగింది, తదుపరి నేర పరిశోధన పూర్తి చేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయడం జరిగింది. జిల్లా జడ్జి కోర్టు పెద్దపల్లి కోర్టులో కేసు విచారణ జరిగింది. . కె . సునీత జడ్జి ఇరువురి వాదనలు విని తదనంతరం నేరస్తులు నేరం చేసినట్లు ఋజువుకావడ%శీ% వలన వారికి 05 సంవత్సరాల కాలం కఠిన కారాగారా జైలు శిక్ష మరియు ఒక్కొక్కరికి 10,000/- రూపాయల జరిమానా విధించారు. నేరస్తునికి శిక్ష పడడానికి ముఖ్యపాత్ర వహించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్: . బాదం రమేష్ సాక్షులను ప్రవేశపెట్టి తన వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. పెద్దపల్లి డిసిపి. పి. కరుణాకర్ గమరియు యం. రమేష్ ఏసీపీ గోదావరిఖని పర్యవేక్షణ లో సాక్షులను ప్రవేశపెట్టడానికి సహకరించిన ఇన్స్పెక్టర్ . ఇంద్రసేనారెడ్డి , కోర్ట్ కానిస్టేబుల్. అరుగొండ. సతీశ్ కుమార్ పి సి 754, సి ఎం స్: పి.కోటేశ్వర రావు హెచ్ సి 2465 లను రామగుండం అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్., ప్రాసిక్యూషన్ బృందానికి అభినందనలు తెలిపారు.

# జాతీయ కరాటే టోర్నీ కి ఎంపికైన మంథని జపాన్ షిటోరియు సికోకాయ్ కరాటే విద్యార్థులు



**మంథని,తెలంగాణ దిశ:**న్యూఢిల్లీలోని తాల్కటోర ఇండోర్ స్టేడియంలో ఆగస్టు ఏడు నుండి పదవ తేదీ వరకు నాలుగు రోజులపాటు నిర్వహించే జాతీయ కరాటే పోటీలకు కరాటే శిక్షకులు కావేటి సమ్మయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా మంథని జపాన్ షిటోరియు సికోకాయ్ కరాటే విద్యార్థులు కథ మరియు కుమితే విభాగాలలో ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో ఎండి తహ హసీన్ తైబా 15 సంవత్సరములు 68 కేజీలు, అండర్ 14 విభాగంలో బండారి మణికంఠ 12 సంవత్సరములు 32 కేజీలు, పోగుల శివ సాకేత్ 10 సంవత్సరములు 24 కేజీలు, మారేడుగొండ రిషి 11 సంవత్సరములు 23 కేజీలు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను షిటోరియు షికో కాయ్ కరాటే ఇండియా అధ్యక్షులు పి భరత్ శర్మ, తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అధ్యక్షులు బి మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ షిటోరియు శికో కాయ్ కరాటే రిప్రజెంటివ్ పాలకుర్తి పాపయ్య, కార్య నిర్వహణ అధ్యక్షులు గుంటిపల్లి సమ్మయ్య, మల్యాల రామస్వామి, ఇన్స్ట్రక్టర్స్ నాగెల్లి రాకేష్,జడగల శివాని,కావేటి శివ గణేష్, మెట్టు హాసిని, కే శ్వేత నందన, టి హర్షిని, కె విష్ణు,హర్షవర్ధన్లు అభినందించారు.

# అటకెక్కిన వివేకా కేసు



**కడప,తెలంగాణ దిశ :** వివేకానంద రెడ్డి హత్య కేసులో ఏం జరుగుతోంది? ఎటువంటి పురోగతి లేదు ఎందుకు? ఇంకా ఈ కేసు కొలిక్కి తేవాలంటే సిబిఐ కి ఎన్ని రోజులు పడుతుంది? తెర వెనుక ఏం జరుగుతోంది? రాజకీయ కోణంలోనే జాప్యం జరుగుతోందా? లేకుంటే పరోక్ష శక్తులు ఆటంకాలు చేస్తున్నాయా? ఇప్పుడు అన్ని వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. నిన్ననే సుప్రీంకోర్టులో అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు పై విచారణ జరిగింది. ఆ సమయంలో సుప్రీంకోర్టు మూడు అంశాలను తెరపైకి తెచ్చింది. అసలు సిబిఐ ఇంకా విచారణ చేపట్టాల్సి ఉందా? అనే ప్రశ్న వేసింది. ఈ కేసు విచారణకు సంబంధించి సుప్రీంకోర్టు విధించిన గడువు ముగియడంతో ఈ ప్రశ్న వేసింది.అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో సిబిఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వ పోలీస్ యంత్రాంగం సహకరించలేదన్నది అప్పట్లో వచ్చిన ఆరోపణ. తిరిగి దర్యాప్తు చేస్తున్న సిబిఐ అధికారులను భయపెట్టే పరిస్థితులు ఉండేవని అప్పట్లో టిడిపి అనుకూల మీడియా వార్తలు ప్రచురించింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. కానీ కనీస స్థాయిలో వివేకానంద రెడ్డి హత్య కేసు ముందుకు సాగడం లేదు. దీనిని ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారా? లేకుంటే 2029 ఎన్నికల సమయానికి మరింత బిగుసుకునేలా కేసు తెరపైకి తేనున్నారా అన్న అనుమానాలు అయితే కలుగుతున్నాయి. తెర వెనుక ఏదో జరుగుతోందన్న అనుమానాలు బలపడుతున్నాయి.2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అయితే అప్పుడు టిడిపి అధికారంలో ఉంది. సిఐడి విచారణకు ఆదేశించింది చంద్రబాబు సర్కార్. అయితే సిఐడి కాదని.. సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు జగన్మోహన్ రెడ్డి. దీంతో సిబిఐ విచారణ ప్రారంభించింది. ఆ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి హత్య అంశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రయోజనం చేకూర్చింది. సానుభూతి వర్కౌట్ అయింది. జగన్ అధికారంలోకి వచ్చారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తు అవసరం లేదని తేల్చి చెప్పారు. దీంతో వివేక కుమార్తె సునీత రంగంలోకి దిగారు. న్యాయ పోరాటం చేయడంతో సిబిఐ విచారణ కొనసాగింది. అయితే ఏపీ ప్రభుత్వం నుంచి సహాయ నిరాకరణ, నిందితుల నుంచి దర్యాప్తు అధికారులకు బెదిరింపులు వంటివి చోటు చేసుకున్నాయి. దీంతో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా వివేకానంద రెడ్డి హత్య కేసును దర్యాప్తు చేయిస్తామని.. నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చంద్రబాబు చెప్పుకొచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న ఈ కేసు విచారణలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు.

ప్రస్తుతం వివేకానంద రెడ్డి కుమార్తె సునీత గట్టిగానే పోరాటం చేస్తున్నారు. తన తండ్రిని చంపిన నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు హోంమంత్రి అనిత తో పాటు బిజెపిని కూడా కలిశారు. కానీ ఆ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి చర్యలు ప్రారంభం కాలేదు. దీంతో వివేకానంద రెడ్డి హత్య కేసు వెనుక ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. అయితే తప్పకుండా దీనిపై చర్యలు ఉంటాయని.. అదును చూసి కూటమి ప్రభుత్వం దెబ్బ కొడుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆ పని ఎప్పుడు జరుగుతుందో చూడాలి.

# ఇంటినెంబర్లతో రిజిస్ట్రేషన్స్..

కరీంనగర్,తెలంగాణ దిశ: కరీంనగర్ జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించింది. అక్రమ రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి, పారదర్శకతను పెంచడానికి ఇంటి కొలతలు, విస్తీర్ణం, ఎన్వోసీ వంటి నిబంధనలు తప్పనిసరి చేశారు. ఈ నిర్ణయంతో గ్రామాల్లో క్రయవిక్రయదారులకు ఊరట లభించింది. అయితే, పురపాలికలు, నగరపాలికల్లో, ముఖ్యంగా కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండితో పాటు కొత్తపల్లి, రేకుర్తిలో ని 200 సర్వే నంబర్లలో ఇంకా రిజిస్ట్రేషన్లపై స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామాల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబా టును అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్తర్వులు ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతోపాటు తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లకు చేరాయి. ఇళ్ల క్రయవిక్రయాలు జరిపే క్రమంలో రిజిస్ట్రేషన్ల సమయంలో విధిగా నిబంధనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. విక్రయించే ఇంటిని పరిశీలించి, ఇంటి విస్తీర్ణం కొలతలు, నాలుగు వైపులా ఉన్న వారి వివరాలు, స్లాబ్ ఏరియాతో పాటు సంబంధిత డాక్యుమెంట్లతో కూడిన ఎన్వోసీ ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యలు అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేసి, పారదర్శకతను పెంచేందుకు ఉద్దేశించినవి అన్నారు.కాగా, గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి నంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించిన అధికారులు, పురపాలికలు, నగరపాలికల్లో మాత్రం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కరీంనగర్ నగరపాలిక, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల్లోని ఇళ్ల క్రయవిక్రయాలకు సంబంధించి ఎలాంటి స్పష్టత లేకపోవడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, రేకుర్తిలోని దాదాపు 200 సర్వే నంబర్లలో భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లు ఇప్పటికీ నిషేధంలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆస్తులను క్రయవిక్రయాలు చేసుకోలేక తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో తీసుకున్న సానుకూల నిర్ణయం పురపాలికలు, నగరపాలికలకు కూడా వర్తింపజేయాలని అక్కడి ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.ఇక గ్రామాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో ఏళ్ల తరబడి అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కరీంనగర్ జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సారంగాపూర్, రాయికల్ మండలాల్లో అత్యధిక అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ అడవుల మధ్య నుంచే పలు రహదారులు వెళ్తాయి. గతంలో ప్రభుత్వం ఈ గ్రామాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టినా, అటవీ ప్రాంతంలో అనుమతులు లేకపోవడంతో పనులు నిలిపివేశారు. కొంతకాలంగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నప్పటికీ, ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడం లేదు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు త్వరగా అనుమతులు మంజూరు చేసి, నిలిచిపోయిన పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

# కమలంలో కల్లోలమేనా...

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దాపరికమేమీ లేదు. దాచినంత మాత్రాన దాగదు. భారతీయ జనతా పార్టీలో వర్గాలు ఏర్పడ్డాయి అనేది నిజం. అందులో కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా మిగతా వారంతా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే.. ఇప్పుడు ఎంపీలుగా ఉన్న కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, గోడం నగేష్, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్ వంటి వారంతా ఇతర పార్టీల లో గతంలో పనిచేసినవారే. రాజకీయ కార్యశాల కోసం వారు తప్పనిసరి పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీని ఎంచుకున్నారుఈటెల రాజేందర్, బండి సంజయ్ మధ్య ఇటీవల మాటల తూటాలు బయటికి వచ్చాయి. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఏమన్నారో తెలియదు గాని.. ఈటల రాజేందర్ అన్న మాటలు మాత్రం మీడియాలో సంచలనంగా మారాయి. కొన్ని మీడియా సంస్థలు ఈటెల రాజేందర్ వ్యాఖ్యల పట్ల సమయమనం పాటించగా.. ముఖ్యంగా గులాబీ అనుకూల మీడియా సంస్థలు మాత్రం మొహమాటం లేకుండా ఆ మాటలు అన్నది బండి సంజయ్ ని ఉద్దేశించే అని చెప్పేశాయి. ఇద్దరి మధ్య ఏకంగా వార్ నడుస్తోందని.. 8 మంది పార్లమెంటు సభ్యులను తెలంగాణ నుంచి గెలిపించి పంపిస్తే.. చివరికి వారు చేస్తోంది ఇది అని రాసింది. ఇంత జరిగిన తర్వాత తెలంగాణ పార్టీ అధ్యక్షుడు ఒక సర్కులర్ జారీ చేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఎవరూ మాట్లాడవద్దని.. అధిష్టానం చూసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఆ యుద్ధానికి తాత్కాలిక ముగింపు మాత్రమే ఆయన ఇచ్చారు..ఈటల రాజేందర్ వ్యాఖ్యలు చేసిన తర్వాత కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అతని అనుచరులు కూడా సైలెంట్ అయిపోయారు.. ఆ తర్వాత బోనాల వేడుకలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పాల్గొన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి కూడా ఉన్నారు. ఇద్దరు కలిసి భోజనం కూడా చేశారు. ఒకానొక దశలో ప్రీతి రెడ్డి బిజెపిలో చేరుతున్నారని వార్తలు కూడా వచ్చాయి. దానిపై అధికారికంగా క్లారిటీ రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఢిల్లీలో తెలంగాణ ప్రాంతానికి చెందిన పార్లమెంట్ సభ్యులు భేటీ అయ్యారు. వీరిలో డీకే అరుణ, రఘునందన్ రావు, ఈటెల రాజేందర్, గోడం నగేష్, ధర్మపురి అరవింద్, విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న సికింద్రాబాద్ ఎంపీ, కరీంనగర్ ఎంపీ ఇందులో కనిపించలేదు.. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి వీరంతా కూడా ఢిల్లీలో ఉన్నారు.విశ్వేశ్వర్ రెడ్డి పార్లమెంట్ విప్ గా కొనసాగుతున్నారు. తెలంగాణ ప్రాంత పార్లమెంట్ సభ్యులకు ఢిల్లీలోని ఆయన తన అధికారిక గృహంలో విందు కూడా ఇచ్చారు. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి.

కిషన్ రెడ్డి సౌమ్యుడు కాబట్టి.. ఆయన గురించి పెద్దగా ప్రస్తావన ఉండడం లేదు.. కానీ ఎటొచ్చీ బండి సంజయ్ గురించే చర్చ నడుస్తోంది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి మిగతా ఎంపీలకు మధ్య గ్యాప్ ఉందని.. అందువల్లే ఆయనను విశ్వేశ్వర్ రెడ్డి పిలవలేదని కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారం చేస్తున్నాయి. అంతేకాదు పార్టీలో ఎంపీలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కి అంతరం పెరిగిపోయిందని.. ఈటెల రాజేందర్ కు మిగతా ఎంపీల సపోర్టు ఉందని.. అందువల్లే ఈ ఫోటోలు బయటికి వచ్చాయని ప్రచారం నడుస్తోంది.

అయితే దీనిపై భారతీయ జనతా పార్టీ సోషల్ మీడియా విభాగం స్పందించే లోగానే జరగాల్సిన ప్రచారం జరిగిపోయింది.. వివరణ ఇచ్చే లోగానే వ్యతిరేక ప్రచారం జోరందుకుంది. 8 మంది పార్లమెంట్ సభ్యులను గెలుచుకొని.. అసెంబ్లీ ఎన్నికల్లో పర్వాలేదు అనుకునే స్థాయిలో సీట్లు సాధించుకొని.. కొన్ని జిల్లాలలో పట్టు సాధిస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఇలా అంతర్గత లుకలుకలతో ఇబ్బంది పడడం.. సోషల్ మీడియాలో చర్చనీయాంశం కావడం పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెడుతోంది. మరి ఈ పరిణామాలకు రామచంద్రరావు ఎలా చెక్ పెడతారో చూడాల్సి ఉంది.



## దేవ దేవతలకు అత్యంత ప్రీతికరమైన మాసం

# శ్రావణమాసం

శ్రావణ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. నెల రోజుల పాటు ఉదయం , సాయంత్రం భగవన్నామస్మరణతో మారు మోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఎలాంటి కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుందంటున్నారు పండితులు. అంత గొప్ప పవిత్రమాసం శుక్రవారంతో ప్రారంభమైంది. అంతేకాకుండా ఈ నెలలో ఎన్నో మంచి రోజులు , విశిష్ట పండుగలు రానున్నాయి.సనాతన ధర్మంలో (హిందూ) చంద్రమానం ప్రకారం మనకున్న పన్నెండు మాసాల్లో ఐదవది ఎంతో పవిత్రత కలిగినటువంటింది శ్రావణమాసం. ఈ నెలలో పౌర్ణమినాడు చంద్రుడు శ్రావణ నక్షత్రంలో సంచరించడం వలన ఈ మాసానికి శ్రావణమాసం అని పేరు వచ్చింది.వర్ష రుతువు ప్రారంభమవుతుంది. త్రిమూర్తుల్లో స్థితికారుడు దుష్ట శిక్షకుడు , శిష్ట రక్షకుడు అయిన మహావిష్ణువుకు ఆయన దేవేరి(భార్య) మహాలక్ష్మికి అత్యంత ప్రీతికరమైన మాసం శ్రావణమాసంగా చెప్పుకుంటారు. వివిధరకాల పూజలు , వ్రతాలు ఆచరించడం వల్ల విశేష ఫలితాలు ప్రసాదించే దివ్యమైన మాసంగా పెద్దలు చెబుతారు. మహావిష్ణువు జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రం కావడం , అటువంటి పేరుతో ఏర్పడిన శ్రావణమాసం మహావిష్ణువు పూజకు ఎంతో ఉత్కృష్టమైనది. ఈ మాసంలో చేసే దైవ కార్యాలకు ఎంతో శక్తి ఉంటుందని వేద పురాణాలు చెబుతున్నాయి. శివారాధనకు ఎంతో విశిష్టత: శ్రావణమాసం దక్షిణాయనంలో వచ్చే విశిష్టమైన మాసాల్లో శ్రావణమాసం ఒకటి. ఈ మాసం శివపూజకు విశిష్టమైనది. ముఖ్యంగా భగవదారాధనలో శివ , కేశవ భేదం లేకుండా పూజించడానికి విశేషమైనది. ఈ నెలలో చేసే ఏ చిన్న దైవకార్యమైనా కొన్ని వేల రెట్లు శుభ ఫలితాన్నిస్తుందని ప్రతీతి. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళలో స్వామివారికి రుద్రాభిషేకాలు , బిల్వార్చనలు చేస్తే పాపాలు కడతేరుతాయని శాస్త్ర వచనం.సోమవారాల్లో శివుడి ప్రీత్యా ర్థం ఈ వ్రతాన్ని (ఉపవాసదీక్షను) చేయాలి. ఈ వ్రతంలో ఉపవాసం ఉండగలిగినవారు పూర్తిగా , అలా సాధ్యంకానీ పక్షంలో రాత్రి పూజ ముగిసిన అనంతరం ఆహారాన్ని భుజించవచ్చు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల అనేక శుభ ఫలితాలు కలుగుతాయి.వీటికి తోడు శ్రావణ శుక్ల పక్షంలో గల పదిహేను రోజులు ఎంతో విశేషమైన రోజులనీ ఒక్కోరోజు ఒక్కో దేవుడికి పూజలు చేయాలని వేద శాస్త్రలు చెబుతున్నాయి. ఈ మాసంలో భక్తితో ఆచరించే ప్రతి పూజకు తగిన ప్రతిఫలం ఉంటుందంటున్నారు పండితులు. మంగళ గౌరీ వ్రతం: శ్రావణ మాసంలో అన్ని మంగళవారల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అనీ , మంగళగౌరీ నోము అని వివిధ రకాలుగా పిలుస్తుంటారు. ఈ వ్రతాన్ని గురించి నారధుడు సావిత్రికి , శ్రీకృష్ణుడు ద్రౌపదికి తెలిపినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లి అయిన వారు ఆచరించాలి. వివాహమైన తర్వాత వచ్చే శ్రావణంలో ఈ వ్రతాన్ని చేయడం ప్రారంభించాలి. శ్రావణమాసంలో వచ్చే అన్ని మంగళవారాల్లో ఈ వ్రతం క్రమం తప్పకుండా చేయాలి. ఐదు సంవత్సరాల పాటు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్వాపన చేయాలి. దీంతో వారు నిండు సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్ట ఐశ్వర్యాలు ఉంటాయి. వరలక్ష్మీ వ్రతం : శ్రావణమాసంలో పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేయాలి. ఒకవేళ అప్పుడు వీలుకాకుంటే శ్రావణ మాసంలో మరొక శుక్రవారమైనా ఈ వ్రతం ఆచరించవచ్చు. పూజ మండపంలో నిండు కలశాన్ని ఏర్పాటు చేసుకుని దానికి వరలక్ష్మీ దేవి ముఖప్రతిమను అలంకరించి పూజ చేయాలి. తర్వాత తొమ్మిది ముడులతో తోరణాన్ని తయారు చేసి పూజ చేసిన అనంతరం ఈ శ్లోకాని పటించాలి. శ్లోకం : బధ్నామి దక్షిణే హస్తే నవసూత్రం శుభప్రదం పుత్ర పౌత్రాభివృద్ధించ దేహిమే రమే అని పటిస్తూ కంకణం చేతికి కట్టుకోవాలి. అలాగే మంత్రాలను పటిస్తూనే ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చి ఆశ్వీరాదాలు తీసుకోవాలి. ఈ వ్రతం స్వయంగా శివుడు పార్వతీదేవికి సూచించి సౌభాగ్యం , మంగళ్య బలాన్ని వివరించినట్లు ప్రసిద్ధి. శ్రావణ మాసంలోని విశిష్టతలు..శుక్ల ద్వాదశి, దామోదర ద్వాదశి అని ఈ మాసంలో రెండు శుభ దినాలున్నాయి. శుక్ల పక్ష ఏకాదశి నాడు ఉపవాసం ఉండి మహావిష్ణువును పూజించినట్లయితే మోక్షం లభిస్తుంది. శుక్ల పక్ష పౌర్ణమి: శ్రావణపౌర్ణమి , రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈ రోజు సోదర , సోదరీ సంబంధానికి సూచికగా రక్షబంధనం జరుపుకుంటున్నాం. అంతే కాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవిత్రధారణ , వేదభ్యాసాన్ని ప్రారంభం చేస్తారు.కృష్ణపాద్యమి , హయగ్రీవ జయంతి , కృష్ణపక్ష విదియ , రాఘవేంద్ర స్వామి ఆరాధన వంటి ముఖ్య రోజులు వచ్చేవి శ్రావణమాసంలోనే. కృష్ణాష్టమి , పొలాల అమావాస్య , గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత. ఎన్నో విశిష్టతలను సొంతం చేసుకున్న ఈ నెలలో చేయాల్సిన విధులు , పూజలు , వ్రతాలు , నియమాలు , తూచ తప్పకుండా ఆచరిస్తే సకల సౌభాగ్యాలు కలుగుతాయి.

# మీడియా వాస్తవాలను వెలువరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,తెలంగాణ దిశ :**ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులు రాజ్యాంగం కల్పించిన పత్రిక స్వేచ్ఛను సద్వినియోగపరచుకుని ప్రజ లకు ఉపయోగపడే విధంగా వాస్తవాలను తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయ రంగానికి ప్రత్యేక స్థానం ఉందని అభివృద్ధి సంక్షేమం దిశగా ప్రభుత్వాలు చేపట్టే పథకాలు కార్యక్రమాలను విస్తృత ప్రచారం చేయడం ద్వారా ప్రజలందరికీ తెలిపి పథకాల ఫలాలు పొందే విధంగా చేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ మారుమూల గ్రామాల నుండి అభివృద్ధి చెందిన పట్టణాల వరకు తమ పరిధిలో జరుగుతున్న అన్యాయాలను ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించడంలో పాత్రికేయులు తమ వంతు బాధ్యత నిర్వహిస్తారని తెలిపారు. మీడియా ద్వారా ప్రపంచానికి తెలియని ఎన్నో వాస్తవాలు బయటపడ్డాయని ఎంతో మంది బాధితులకు అవసరమైన సహాయం న్యాయం అందాయని తెలిపారు. కానీ జిల్లాలో కొంతమంది పాత్రికేయులు అవాస్తవ వార్త కథనాలను ప్రచురిస్తూ వ్యాపార వాణిజ్య సంస్థలలో ప్రభుత్వ కార్యాలయాలలో వ్యక్తిగత బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చిందని తెలిపారు. పాత్రికేయులు తాము ప్రచురించే విషయాలపై పూర్తి నిజనిర్ధారణ చేసుకోవాలని చెప్పారు జిల్లాలో కొంతమంది నకిలీ జర్నలిస్టుల కారణంగా అసలైన జర్నలిస్టులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇలాంటి అవాస్తవాలను ప్రచురిస్తూ బెదిరింపులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# నాలుగు నెలలుగా జీతాల్లేని టీచర్స్

**నల్గొండ,తెలంగాణ దిశ :** వారంతా చిరుద్యోగులే. నెలంతా పనిచేస్తే వారికొచ్చే జీతం రూ.15 వేల నుంచి రూ.19,500 వరకే. ఈ కాస్తంతా జీతం కూ డా అందక ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి రాష్ట్రం లోని మోడల్ స్కూళ్లలో నెలకొంది. గత నాలుగు నెలలుగా వారికి జీతాలు అందడంలేదు. మరో పది రోజులు గడిస్తే జూలై నెల కూడా పూర్తవుంతోంది.కానీ ఇంతవరకు వారికి జీతాలు అందని పరిస్థితి. నెలంతా ప నిచేస్తే ఇవ్వాల్సిన వేతనాలను సమయానికి అందించకపోవడంతో మోడల్ స్కూళ్లలో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రతి నెలా జీతాలు ఆలస్యమవుతుండటం తో కుటుంబాలు గడవలేని పరిస్థితి అని ఉ ద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఈవిధంగా నెలల తరబడిగా వేతనా లు విడుదల చేయకపోవడం సరైంది కాదని నిలదీస్తున్నారు. ఒకవైపు చాలీచాలని వేతనాలు, దీనికితోడూ ఆలస్యంగా ఇస్తే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. అసలే నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. పిల్లలకు పుస్త కాలు, యూనిఫామ్ కొనాలన్న తమ వద్ద డబ్బులు ఉ ండడంలేదని పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో 194 మోడల్ స్కూళ్లు ఉన్నా యి. ఒక్కో స్కూల్లో కంప్యూటర్ ఆపరేటర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, అటెండర్, నైట్ వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. వీరందరికీ గత మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెల వేతనాలు అందాల్సి ఉంది. ఇవి ఇంతవరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. జూలై నెల గడుస్తోంది. ఇం కో వారం, పది రోజులైతే ఐదు నెలల వేతనాలు ఉద్యోగులకు చెల్లించాల్సి ఉంటుంది.ఒకట్రెండు నెలలు వేతనాలు ఆలస్యమైతే సర్దుకోవచ్చు కానీ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారు. జీతాలు ఎప్పుడొస్తాయో తెలియకపోవడం తో ఉద్యోగులు ఇంటి అద్దె, నెలవారి ఖర్చు లు, ఈఎంఐలు, ఇతర చెల్లింపుల విషయం లో ఇబ్బందులు పడుతున్నారు. పెనాల్టీలతో చెల్లింపులు చేస్తున్నట్లు వాపోతున్నారు.కుటుంబాలు కూడా గడచే పరిస్థితిలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్నేహి తులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి కు టుంబాలను పోషించుకుంటున్నారు. ఇదేదో ఒక నెల, రెండు నెలలు కాదు. ప్రతిసారి ఆలస్యంగానే అందుతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. నేడు, రేపు అంటూ ఎప్పుడు వేతనాలు వస్తాయోనని ఎదురుచూడాల్సిన పరిస్థి నెలకొందంటున్నారు. ఇంటి నుంచి స్కూళ్లకు వెళ్లేందుకు కనీసం బైక్ పెట్రోల్‌కు డబ్బులు కూడా ఉండడం లేదని ఓ ఉద్యోగి వాపోయాడు.జీతాలు అందక చిరుద్యోగులు విలవిల్లాడుతున్నారు. వచ్చేదే అరకొర జీతం. దీనికి నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. జీతాల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం ఉ ండడంలేదని మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వాపోతున్నారు. వీరి వేతనాలకు సంబంధించిన బిల్లులు ఇప్పటికే స్టేట్ ఆఫీస్‌కు చేరాయి.ఇక్కడి నుంచి అధికారులు సైతం ఆర్థికశాఖకు పంపించారు. పంపించి రోజులు గడుస్తున్నా బిల్లుల విడుదలకు ఇంకా క్లియరెన్స్ రావడంలేదు. బడ్జె ట్ లేదని అధికారులు సమాధానం చెబుతున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. అప్రూ వల్ కాగానే జమ చేస్తామని అంటున్నారు. పైగా వచ్చినప్పుడే తీసుకోవాలని అధికారులు బదులిస్తున్నారు. తక్షణమే నాలుగు నెలల జీతాలు విడుదల చేయాలి. మా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయి. నిత్యావసర సరుకులు, రోజూవారి ప్రయాణ ఖర్చులకు డబ్బులు ఉండడంలేదు. గత ఆరు నెలలుగా ఇదేతంతు. సకాలంలో జీతాలు వేయడంలేదు. మొక్కుబడిగా జీతాలు చెల్లిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తారీఖున మాకు జీతాలు వేయాలి. జీతాలు ఆలస్యం కావడంతో ఈఎస్ఐ, పీఎఫ్ సకాలంలో చెల్లించడంలేదు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి


**-ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ : యు ఎస్ పి సి**

**మందమర్రి,తెలంగాణ దిశ:** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి)మందమర్రి మండలం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికై నిర్వహించే దశలవారీ పోరాటంలో భాగంగా మందమర్రి మండల తహసీల్దార్ గారి ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారికి వినతి పత్రాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా యుఎస్ పి సి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని,బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, పిఆర్సి ని ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఎ లను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ను రద్దుచేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలని, 317 జీవో వల్ల నష్టపోయిన ఉ పాధ్యాయులందరినీ, వారి వారి సొంత జిల్లాలకు పంపించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జిఓ 25ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలని, టైం స్కేల్ ఇవ్వాలని, వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్ టైం ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలని, నూతన జిల్లాలకు డిఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్‌కు డిప్యూటీ ఈఓ, నూతన మండలాలకు యంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌ను రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని, ఉ పాధ్యాయుల, పెన్షనర్ల, వివిధ రకాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలకు 5571 పియస్ హెచ్‌యం




పోస్టులను మంజూరు చేయాలని, పండిట్, పిఈటిల అప్ గ్రేడేషన్ ప్రక్రియ పూర్తి అయినందున జిఓ 2,3,9,10 లను రద్దు చేసి జిఓ 11,12 ల ప్రకారం పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు మార్గదర్శకాలను సవరించాలని, వివిధ జిల్లాల్లో జరిగిన పైరవీ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని, గురుకుల టైం టేబుల్ సవరించాలని, కెజిబివి, మోడల్ స్కూల్స్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని, కే జి బి వి, యూ ఆర్ ఎస్, సమగ్ర శిక్ష, కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయా లని, మోడల్ స్కూల్, గురుకుల సిబ్బందికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలలోని పండిట్, పిఇటి పోస్టులను అప్ గ్రేడ్ చేసి వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, ఉ పాధ్యాయులను పర్యవేక్షణ అధికారులుగా నియమించాలనే ఉ త్తర్వులను ఉపసంహరించాలని, విద్యారంగంలో ఎన్ జి ఓ జోక్యాన్ని నివరించాలని, అన్ని జిల్లాలకు శానిటేషన్ గ్రాంట్స్ విడుదల చేయాల ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యు ఎస్ పి సి) నాయకులు పోడేటి సంజీవ్, భూక్యా కిరణ్ కుమార్, దేవ రమేష్, అనంతరావు, వెంకటలక్ష్మి తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత




**హుజురాబాద్ బస్ స్టాండ్ సందర్శన,సమస్యలు పరిష్కరిస్తాం**
**ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం**
**బిజెపికి టచ్ లో కౌశిక్ ప్రణవ్**

హుజురాబాద్,తెలంగాణ దిశ : ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ పట్టణంలోని బస్ స్టాండ్ ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా బస్ స్టాండ్ లో ఉన్న పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి,పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం పెట్టిన తర్వాత ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళలకు ఉచిత టికెట్ లను ఇచ్చామని,6,800 కోట్ల ప్రయాణ చార్జీలను మహిళలు ఆదా చేసుకున్నారని,ఇదొక చరిత్ర అని అన్నారు. హుజురాబాద్ డిపో పరిధిలో దాదాపు 1,34,02,821మందికి సుమారు 53 కోట్లు ప్రయాణ ఛార్జీలను మహిళలు ఆదా చేసుకున్నారని అన్నారు.బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలల్లో చేసి చూపెట్టింది అన్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని,విమర్శించనవారే కితాబు ఇస్తున్నారని అన్నారు.మహిళలను ఆర్థికంగా చేయూత ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మహిళా సంఘాలకు బస్ నడుపుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం నుండి కల్పించామని అన్నారు.విజయవంతంగా పథకాన్ని నడిపిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. దళిత బంధు ఆపి దళిత బంధు విషయంలో కౌశిక్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నాడని,ఉ ప ఎన్నికల సమయంలో ప్రారంభమైన దళిత బంధు పథకం హుజురాబాద్ నియోజకవర్గంలో అందరికి ఇవ్వకుండా కౌశిక్ రెడ్డి కుట్రలు చేశారని అన్నారు. ప్రభుత్వ విప్ గా,ఎమ్మెల్సీ గా ఉండి ఆనాడు దళిత బంధు ఎందుకు ఇవ్వలేదో సమాధానం చెప్పాలని అన్నారు. కేవలం ఓట్ల రాజకీయం కోసం వారిని వాడుకున్నారే తప్ప వారి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోపే దళిత సంఘాల నాయకులకు ఇచ్చిన మాట మేరకు ప్రభుత్వ పెద్దలకు ఈ సమస్యపై పలు దఫాలు చర్చించగా గత జనవరిలో ఫ్రీజింగ్ ఎత్తివేశామని, ప్రభుత్వంలో ఉండి చేయలేక ఇప్పుడు మా ప్రభుత్వం చేస్తుంటే కౌశిక్ రెడ్డి ఓర్వలేకపోతున్నాడని,దళితులు ఎవరు అధైర్యపడిద్దని, ఆలస్యమైన అర్హులైన ప్రతి లబ్దిదారునికి దళిత బంధు నిధులు అందజేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని అని అన్నారు. ఇండ్లు , ప్రభుత్వ పథకాలను అందరికీ అందజేసేలా కృషి చేస్తా అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం మంచి పనులు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మింగుడు పడడం లేదని, అధికారంలో ఉన్నప్పుడు ఒక్క ఇళ్ళు అయినా హుజురాబాద్ పేద ప్రజలకు ఇచ్చాడా అని ప్రశ్నించారు? కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా పంచలేదని,ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో 3500 ఇళ్లను మొదటి విడతగా అందజేశామని,బేస్మెంట్ వరకు పూర్తైన ఇళ్లకు డబ్బులు కూడా పడ్డాయని, మొదటి కౌశిక్ రెడ్డి కళ్ళు పెద్దగా చేసి చూస్తే ప్రభుత్వం చేసే సంక్షేమ పథకాలు కనిపిస్తాయని అన్నారు. కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను త్వరలో మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందిస్తామని అన్నారు.సన్నబియ్యం,రేషన్ కార్డులు,ఆరోగ్య శ్రీ,రైతు భరోసా,రుణమాఫీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్ లాంటి పథకాలు ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. బీజేపీ నాయకులు బండి సంజయ్,ఈటల రాజేందర్ మధ్య జరుగుతున్న అంతర్గత పార్టీ విషయాల్లో కౌశిక్ రెడ్డి దూరడం చూస్తే బీజేపీ ట్రాప్ లో కౌశిక్ రెడ్డి పడుతున్నాడని అందుకే బండి సంజయ్ కు మద్దతుగా మాట్లాడుతున్నాడని ప్రణవ్ ఆరోపించారు. బీజేపీ,బీఆర్ఎస్ దొందూ దొందే అని ఎలక్షన్ నుండి చెప్తున్న అని ఇప్పుడు కౌశిక్ రెడ్డి మాట్లాడడం చూస్తుంటే నిజమని తెలుస్తుందని అన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 5 మండలాల్లో,2 పట్టణాల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తామని అన్నారు. హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుందనీ ధీమా వ్యక్తం చేశారు.

# మళ్లీ రైతన్నల పోరుబాట..





న్యూఢిల్లీ : కేంద్రంలోని బిజెపి సర్కారుకు వ్యతిరేకంగా రైతన్నలు మరోసారి పోరుబాట పట్టారు. మోడీ సర్కారు సాగిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ రణ గర్జన చేశారు. భారతీయ ఆర్థిక వ్యవస్థ ప్రత్యేకంగా వ్యవసాయ, పాడి రంగాల తలుపులను విదేశాలకు తెరిచేందుకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ) సంతకం చేయాలంటూ అమెరికా చేస్తున్న ఒత్తిళ్లకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం లొంగిపోతుందేమోనని తమకు తీవ్రమైన అనుమానాలు ఉన్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) మంగళవారం తెలిపింది. ఎఫ్‌టీఏ పై సంతకం చేయడం వల్ల దేశ ప్రయోజనాలు దెబ్బతినడమేగాక ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఎస్‌కేఎం ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయి ఎఫ్‌టీఏపై సంతకం పెట్టేందుకు బిజెపి సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రయత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వరుసగా ప్రజా నిరసనలు నిర్వహించనున్నట్లు ఎస్‌కేఎం ప్రకటించింది.

దేశ వ్యాప్తంగా ఆందోళనలు: రానున్న ఆగస్టు 13న కార్పొరేట్స్ క్విట్ ఇండియా అనే నినాదంతో ట్రాక్టర్, మోటారు వాహనాల ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మలు దహనం చేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఓ ప్రకటనలో వెల్లడించింది. జూలై 30న పంజాబ్‌లోని అన్ని జిల్లాలలో ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆగస్టు 24 న పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వ కొత్త భూ సమీకరణ విధానానికి వ్యతిరేకంగా మహా పంచాయత్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. 2020-21 చారిత్రాత్మక రైతుల పోరాటం 5వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 26న కార్మిక సంఘ ఉద్యమం, వ్యవసాయ కూలీల ఉద్యమాన్ని సమన్వయం చేసుకుని న్యూఢిల్లీతోపాటు అన్ని రాష్ట్ర రాజధానులలో కార్మికుల-వ్యవసాయ కూలీల నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపింది. 20న ఆన్‌లైన్‌లో జరిగిన సర్వసభ్య

## దేశవ్యాప్త నిరసనలకు ఎస్‌కేఎం రణగర్జన

సమావేశంలో 12 రాష్ట్రాల నుంచి 37 రైతు సంఘాలకు చెందిన 106 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు ఎస్‌కేఎం పేర్కొంది.

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్లు : అదానీ గ్రూపునకు చెందిన బొగ్గు గనుల కోసం బలవంతంగా భూమిని సేకరించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియచేస్తున్న సింగ్రౌలీ గిరిజన రైతులకు సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం పూర్తి సంఘీభావం ప్రకటించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ ప్రాజెక్టుల కోసం తక్కువ ధరకు భూములను సేకరించే అన్ని రకాల భూములకు చెందిన వాటి యజమానులకు మార్కెట్ ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఎస్‌కేఎం డిమాండ్ చేసింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా భూముల ధరలను పెంచాలని కోరింది. పునరావాసం లేకుండా భూ సేకరణ జరపడానికి వీల్లేదని తెలిపింది. బుల్డోజర్ పాలనను అంతం చేయాలని, పంట పొలాలలో బలవంతంగా హై వోల్టేజీ ట్రాన్స్‌మిషన్ లైన్లను నిర్మించకూడదని ఎస్‌కేఎం డిమాండు చేసింది. దేశంలో ఆహార కొరతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ భూమిని పరిరక్షించాలని కోరింది. 189 రోజులపాటు పోరాటం సాగించి విజయం సాధించిన కర్నాటకలోని దేవనహళ్లి రైతులకు శుభాకాంక్షలు తెలిపింది. బిజెపి-ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని శిక్షించేందుకు బీహార్‌లో ప్రచారం చేయాలని నిర్ణయించిన ఎస్‌కేఎం నాయకత్వం సెప్టెంబర్‌లో బీహార్‌ను సందర్శించాలని యోచిస్తున్నట్లు పేర్కొంది. బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండు చేసింది.

# హద్దుమీరుతున్న నేతల రాజకీయ భాష!

రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటుతోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడుతున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన బిఆర్‌ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళ్లు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తు న్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా, సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయంలో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్‌ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడతారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కులమైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యాగాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకుడు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొపెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలిస్టులను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాదిన్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్చనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగప్సాకరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ సొంత జాగీరుగా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికారంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజాధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుంబానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోంది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తులతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్ములా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు..ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియంత్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడిగడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళు విసరుతారు. నిజానికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్సవానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమరావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటిఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉండడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించరాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణతో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.

# రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్ల షాక్

## 15 శాతం పెరిగిన విద్యుత్ బిల్లులు వ్యతిరేకంగా ప్రజల ఆందోళనలు

జైపూర్ : రాజస్థాన్‌లో విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్ల షాక్ కొడుతోంది. బిజెపి పాలిత రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో దాదాపు పూర్తి స్థాయిలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేశారు. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల కోట్లను ఖర్చు చేసింది. గతంలో పాత విద్యుత్ మీటర్‌తో ఏ వినియోగదారుడూ ఎటువంటి సమస్యను ఎదుర్కోలేదు. తాజా స్మార్ట్ మీటర్లతో ఇప్పుడు వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల రీడింగ్‌లు చాలా వేగంగా తిరుగుతున్నాయి. ఇది వరకటితో పోలిస్తే 15 శాతం బిల్లులు అధికంగా వస్తున్నాయని వేలాదిమంది వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నెలవారీ బిల్లులు గురించి విద్యుత్ అధికారులకు ఫిర్యాదులు చేస్తుంటే పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్మార్ట్ మీటర్లలో రీడింగ్ నమోదైన తరువాత తామేమీ చేయలేమని అధికారులు చేతులేత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా వచ్చినా బిల్లు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. ఆలస్యంగా బిల్లు చెల్లిస్తే జరిమానా విధిస్తున్నారని, నోటీసు లేకుండా కనెక్షన్లు కట్ చేస్తున్నారని చెప్పారు. తిరిగి మళ్లీ కనెక్షన్లు ఇవ్వడానికి రూ.2,500 వసూలు చేస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు.

బిల్లు గణనీయంగా పెరిగింది : స్థానికులు

హల్దీఘాటీ మార్గ్‌లోని తిరుపతినగర్‌కు చెందిన దినేష్ వర్మ స్థానిక మీడియాతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తరువాత విద్యుత్ బిల్లు పెరిగాయని, మునుపటి బిల్లులతో పోల్చినప్పుడు గణనీయమైన తేడా కనిపించిందని చెప్పారు. తిరుపతి బాలాజీ నగర్‌కు చెందిన వినియోగదారుడు వినోద్ థాపా మాట్లాడుతూ అధికంగా వచ్చిన బిల్లును గడువులోపు చెల్లించలేకపోయానని, దీంతో తన కనెక్షన్ తొలగించినట్లు చెప్పారు. మళ్లీ కనెక్షన్ ఇవ్వడానికి అదనంగా రూ.2500 వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ధాని ఝూత్వారాకు చెందిన రణవీర్ సింగ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ ఏర్పాటు తరువాత బిల్లులు పెరిగాయని, సమస్యను అనేకసార్లు అధికారులకు నివేదించినా ఎలాంటి పరిష్కారం చూపలేదని చెప్పారు.

కాగడాల ప్రదర్శన: స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. హనుమాన్‌గఢ్‌లో సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం రాత్రి కాగడాల ప్రదర్శన చేశారు. స్మార్ట్ మీటర్లను అనుమతించేది లేదంటూ ప్రజలు పెద్దపెట్టున నినాదాలు చేశారు.


26న సిపిఎం భేటీ: రాజస్థాన్‌లో స్మార్ట్ మీటర్లను ఏకపక్షంగా విధించడాన్ని, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర కమిటీ ఈ నెల 26 ఉదయం 11 గంటలకు సికార్‌లోని పార్టీ కార్యాలయం ముందు ఉన్న స్టేషన్ రోడ్‌లోని రన్మల్ సింగ్ కిసాన్ ఆడిటోరియం హాల్‌లో ఒక సమావేశం నిర్వహిస్తోంది.

ఈ సమావేశానికి ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్, సికార్ ఎంపి అమ్రారామ్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, అఖిల భారత ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ సంయుక్త కార్యదర్శి సుదీప్ దత్తా, విక్రమ్ సింగ్ పాల్గొననున్నారు. ఈ విషయాన్ని పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులకు విరుద్ధం : సిపిఎం ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో, ఎలాంటి అవసరం లేకపోయినా పాత వర్కింగ్ మీటర్ల స్థానంలో రీడింగ్‌లను వేగంగా పెంచే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం తీవ్రమైన అంశమని, సామాన్య ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతున్నారని సిపిఎం విమర్శించింది. ఈ ప్రక్రియ విద్యుత్ బిల్లు 2020ని అమలు చేసే దిశగాఉందని, ఈ బిల్లును ఉపసంహరించుకుంటామని




రైతు ఉద్యమ సమయంలో లిఖితపూర్వకంగా ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేసింది. 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియలో ప్రజాస్వామ్య చర్చలు, పారదర్శకత, జవాబుదారీతనం పూర్తిగా లోపించాయి. ఇది ప్రజాస్వామ్య వ్యతిరేకమే కాదు, ప్రజా వనరులను ప్రైవేట్ ప్రయోజనాలకు అప్పగించడానికి ఒక రహస్య కుట్ర కూడా. సిపిఎం రాజస్థాన్ రాష్ట్ర కమిటీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది' అని తెలిపింది.



## సమంతలా ఉండే నువ్వు ప్రియా ఆనంద్ లా ఐపోయావ్ అన్న నెటిజన్

అష్మురెడ్డి సోషల్ మీడియా అణుబాంబు. ఎప్పుడూ పొట్టి పొట్టి బట్టల్లో హాట్ గా కనిపిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు పద్దతిగా కూడా కనిపిస్తుంది. అలాంటి అష్మ చూడడానికి జూనియర్ సమంతలా ఉంటుంది. ఈ విషయాన్నీ నెటిజన్స్ , ఫాన్స్ అంటూ ఉంటారు. జూనియర్ సమంత అంటూనే కామెంట్స్ చేస్తూ ఉంటారు. ఐతే ఈ మధ్యకాలంలో ఆమె రూపు రేఖల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. జిమ్ కి వెళ్తూ కొంచెం సన్నబడింది.

రీసెంట్ గా తన ఇన్స్టాగ్రామ్ పేజీలో ఒక షార్ట్ డ్రెస్ లో క్యూట్ హాట్ పిక్స్ ని షేర్ చేసింది. ఐతే ఇందులో ఆమె సమంత లుక్స్ అస్సలు కనిపించడం లేదు. ఒక నెటిజన్ ఆమె గురించి ఒక చేశారు. " సమంతలా ఉండేదానివి ప్రియా ఆనంద్ లా అయ్యావ్. కావాలంటే ఒక గంట కూర్చుని నీ లేటెస్ట్ పిక్స్ చూసుకో" అంటూ పోస్ట్ చేశారు. ప్రియా ఆనంద్ లీడర్ మూవీలో రత్న ప్రభ అనే రోల్ లో అలాగే రామ రామ కృష్ణ కృష్ణ అనే మూవీలో ప్రియా రోల్ లో నటించింది. అలాగే అష్మ ఫామిలీ స్టార్స్ షోలో సుధీర్ కి మరదలిగా చేస్తోంది. వీళ్ళిద్దరూ జోడి బాగుంది అంటూ ఇంకో నెటిజన్ కామెంట్ చేసారు. హాలీవుడ్ హీరోయిన్ అంటూ మరొకరు కామెంట్ చేసారు. అష్మ బిగ్ బాస్ కంటెస్టెంట్ గా కూడా వెళ్ళింది. ఈ మధ్య టీవీ షోస్ అలాగే ఫోటో షూట్స్ తో ఎంజాయ్ చేస్తోంది. ఇక అష్మ తన పిక్స్ ని పోస్ట్ చేసుకుని "నువ్వేదో బ్లాక్ మ్యాజిక్ చేసావ్" అంటూ కాప్షన్ పెట్టుకుంది.

## కొత్త అవతారం ఎత్తిన సదా..



సదా పేరు చెబితే చాలామందికి 'జయం' సినిమాలో ఆమె చెబుతున్న "వెళ్ళవయ్యా వెళ్ళు%%" అనే డైలాగ్ వెంటనే గుర్తొస్తుంది. ఆ సినిమా ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ, తన టాలెంట్‌తో అతి తక్కువ సమయంలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతేకాదు, లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'అపరిచితుడు'లో అవకాశం దక్కించుకుంది. దీంతో సౌత్ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ అయినా, ఆమె కెరీర్ ఊహించినంత ముందుకు సాగలేదు. 'అపరిచితుడు' తర్వాత సదా సరైన స్క్రిప్ట్‌లు ఎంచుకోలేకపోయింది. వరుస ఫ్లాపులతో ఆమె క్రేజ్ తగ్గుతూ వచ్చింది. సినిమాలు ఆశించిన స్థాయి చేరకపోవడంతో పాటు, కొన్ని గోల్డెన్ ఆఫర్స్‌ను వదులుకోవడం కూడా ఆమె కెరీర్‌కు ఎదురుదెబ్బ అయ్యింది. చంద్రముఖి సినిమాలో మొదటగా జ్యోతిక పాత్రకు సదాకే అవకాశం వచ్చింది. కానీ 'అపరిచితుడు' షూటింగ్ కారణంగా డేట్స్ కుదరక, ఆ అవకాశాన్ని కోల్పోయింది. శేఖర్ కమ్ముల 'ఆనంద్' చిత్రం కోసం కూడా మొదటగా సదానే అని అనుకున్నారు. కానీ ఆమె ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించడంతో మరో హీరోయిన్‌కి ఆ అవకాశం దక్కింది. ఇలా సదా అప్పుడు తీసుకున్న తప్పుడు నిర్ణయాలతో తన కెరీర్ సందిగ్ధంలో పడ్డట్టు అయింది. అయితే సిల్వర్ స్క్రీన్ దూరమైనా, సదా బుల్లితెరపై కొన్నాళ్లు తన హవా కొనసాగించింది. 'ఢీ', 'నీతోనే డాన్స్' వంటి డ్యాన్స్ షోలు జడ్జిగా హాజరై మళ్లీ పాపులారిటీ తెచ్చుకుంది. అయితే ఇటీవలి కాలంలో సినిమా, టీవీ రెండినీ కూడా పక్కనపెట్టి సదా పూర్తిగా కొత్త దిశగా అడుగులు వేసింది. సదా ఇప్పుడు కెమెరా ముందుకు కాకుండా కెమెరా వెనకకు వెళ్లింది! ఆమె ప్రస్తుతం వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై పూర్తిగా ఫోకస్ పెట్టింది. అనే యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించి, అడవుల్లో జంతువుల వీడియోలు చిత్రీకరించి షేర్ చేస్తోంది. ఇటీవల ఆమె తన నికాన్ కెమెరాతో ఆఫ్రికా అడవుల్లో ఓలోమిన జాతికి చెందిన సింహాన్ని చిత్రీకరించింది. ఆ సింహం స్లోమోషన్‌లో నడుస్తున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని చూసినవారంతా సదా ఫోటోగ్రఫీ టాలెంట్‌కి ఫిదా అయ్యారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215